www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -229 శనివారం 22 నవంబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## రాయపూర్‌లో మూడ్రోజుల పాటు డిజిపిల సమావేశం

హాజరవుతున్న ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు



2లో

## శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి

- ముర్ముకు స్వాగతం పలికి దర్శనం కల్పించిన టిటిడి



2లో



## హైదరాబాద్ చేరుకున్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- స్వాగతం పలికిన గవర్నర్, సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,నవంబర్21ప్రజావినికిడి,** ఒకరోజు పర్యటనకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. ఐదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలి ముర్ముకు సిఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అలాగే రాష్ట్రపతికి మిగతా2లో...

# త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ

- ఏటీసీలుగా 65 ఐటీఐ కళాశాలల మార్పు
- జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం

**హైదరాబాద్,నవంబర్21ప్రజావినికిడి,** 65 ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని.. ఇది దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. ఇంజనీర్లను తయారు చేసే శక్తివంతమైన దేశ ఇంజిన్ అని ప్రశంసించారు. విద్యార్థుల ప్రతిభ ప్రపంచానికి ఎంతో గర్వకారణమన్నారు. విద్య అనేది ఖర్చు కాదని, భవిష్యత్తును నిర్మించే పెట్టుబడని విద్యార్థులకు భట్టి విక్రమార్క సందేశం ఇచ్చారు. ఉద్యోగాలు వెతికే వారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే వారిగా ఎదగాలని సూచించారు. మొదటి 60 ఏళ్ల కంటే, వచ్చే 60 ఏళ్లు మరింత మహోన్నతంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి కోరారు.



## పూర్తికాలం సిఎంగా సిద్దరామయ్యే...

- ఊహాగానాలకు తెరదించిన డికె



**బెంగళూరు,నవంబర్21ప్రజావినికిడి,** కర్ణాటకలో సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తొలగించి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కు ఆ పదవిని కట్టబెట్టబోతున్నారనే ఊహాగానాలకు తెరపడినట్లే. కర్ణాటక కాంగ్రెస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు మిగతా2లో...

## అబద్దాల ప్రచారంలో కెటిఆర్ దిట్ట

- గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలకు మేం దూరం
- ఉపాధి, ఉద్యోగాల కోసం పెట్టుబడుల వేట
- గతంలో ఇచ్చిన జీవోల ఆధారంగానే భూ కేటయింపులు
- ఎవ్వరికీ భూములు దోచిపెట్టే పరిస్థితి లేదు
- కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు




2లో

## మావోయిస్ట్ అగ్రనేతల విడుదలపై విచారణ

పోలీసుల వద్ద ఉన్నారనే ఆధారాలు లేవు


హెబియస్ కార్పస్ పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ



**అమరావతి,నవంబర్21ప్రజావినికిడి,:**మావోయిస్టు అగ్రనేతల ఆచూకీ కోసం ఏపీ హైకోర్టులో దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై శుక్రవారం మరోసారి విచారణ జరిగింది. మావోయిస్ట్ పార్టీ కీలక నేతలు దేవ్ జీ, రాజిరెడ్డి... పోలీసుల వద్ద ఉన్నారనేందుకు ప్రాథమిక ఆధారాలు లేవని.. వ్యాజ్యంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు ధర్మాసనం మిగతా2లో...

## దుబాయ్ ఎయిర్ షోలో ప్రమాదం


ప్రదర్శన సమయంలో కుప్పకూలిన తేజస్




**న్యూఢిల్లీ, నవంబర్21ప్రజావినికిడి,**దుబాయ్‌లో జరుగుతున్న ఎయిర్ షోలో ప్రమాదం చోటు చేసుకుంది. భారత్‌కు చెందిన తేజస్ యుద్ధ విమానం కూలిపోయింది. ఎయిర్ షోలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ప్రదర్శన జరుగుతుండగా.. విమానం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ వెంటనే పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా భయాందోళనకర వాతావరణం నెలకొంది. మిగతా2లో...

## తెలంగాణలో భారీగా ఐపిఎస్‌ల బదిలీ

- పలు జల్లాలకు కొత్త ఎస్పీల నియామకం



**హైదరాబాద్,నవంబర్21ప్రజావినికిడి,** తెలంగాణలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధంచేస్తున్న వేళ ప్రభుత్వం భారీ ఎత్తున పోలీస్ అధికారులను బదిలీ చేసింది. పలు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది. డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నోటిఫికేషన్ వస్తే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో ముందుగానే ప్రభుత్వం ఐపిఎస్‌లను బదిలీ చేసినట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతం ఉన్న వారిలో చాలామందిని బదిలీ చేసింది. ఈ క్రమంలో మొత్తం 32 మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ డీజీగా జయేంద్రసింగ్ చౌహాన్, సీఐడీ డీజీగా పరిమళ హన నూతన్ జాకబ్, పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా చేతన్ మైలబత్తుల, మహేశ్వరం జోన్ డీసీపీగా కే నారాయణ రెడ్డి, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా పీవీ పద్మజలు నియమితులయ్యారు. ఇక నాగర్‌కర్నూల్ ఎస్పీగా సంగ్రామ్ సింగ్, హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా కిరణ్ ప్రభాకర్, మిగతా2లో...



## పంచాయితీ రిజర్వేషన్లపై కసరత్తు

నేడు జివో విడుదల చేయనున్న పంచాయితీరాజ్ శాఖ

ఒకటి రెండు రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు

**హైదరాబాద్,నవంబర్21ప్రజావినికిడి,** పంచాయితీ ఎన్నికలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ల విధి విధానాలు పంచాయతీరాజ్ శాఖ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం జీవో ఇవ్వనుంది. రిజర్వేషన్లు 50శాతం మించకుండా కొత్త రిజర్వేషన్లను సిఫార్సు చేస్తూ డెడికేటెడ్ మిగతా2లో...

## రాష్ట్రంలో భారీ భూకుంభకోణం

- నాలుగు లక్షల కోట్ల విలువచేసే భూమికి రెక్కలు
- భూములపై వాలిపోతున్న రేవంత్ ముఠా
- నన్ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్‌కు లేదు
- మీడియ సమావేశంలో కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్,నవంబర్21ప్రజావినికిడి,** రాష్ట్రంలో భారీ భూకుంభకోణం జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఏకంగా నాలుగు లక్షల కోట్ల విలువచేసే భూమిని కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి ముఠా కుట్ర చేస్తున్నదని ఆయన సంచలన ఆరోపణ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూములు ఎక్కడున్నా రేవంత్ ముఠా అక్కడ వాలిపోతోందని అన్నారు. ఎంతో విలువైన భూములపై రేవంత్ కుటుంబసభ్యుల కన్ను పడిందని ఆరోపించారు. బాలానగర్ పరిసరాల్లో సుమారు 9300 ఎకరాల భూకుంభకోణం జరుగుతోందని చెప్పారు. మిగతా2లో...

## అబద్ధాల ప్రచారంలో కెటీఆర్ దిట్ట

**హైదరాబాద్,నవంబర్21ప్రజావినికిడి,** పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు అసత్యాలు చెబుతున్నాని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం సిఎం రేవంత్ నేతృత్వంలో పెట్టుబడుల కోసం, ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని అన్నారు. అచిర కాలంలోనే తెలంగాణ అనేక విజయాలు సాధించిందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా అడ్డగోలుగా జీవోలు, చెల్లింపులు చేయడం లేదని, వారి హయాంలో ఏం చేసినా దాని వెనుక ఓ మతలబు ఉండేదని ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.'మా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై కేటీఆర్ ఆరోపణలు చేశారు. మొత్తం 9,292 ఎకరాల భూమి గురించి మాట్లాడారు. పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భూములను తక్కువ ధరకు ఇస్తోంది. 2023లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడు జీవోలు ఇచ్చింది. ఆ జీవో ప్రకారం హైదరాబాద్‌లోని భూములను ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ భూమి అమ్ముకున్నట్టు కేటీఆర్ మాట్లాడుతున్నారు. ఫ్రీహోల్డ్, ల్యాండ్ లీజ్‌కు తేడా లేకుండా మాట్లాడారు. 2023లో భారత రాష్ట్ర సమితి తెచ్చిన జీవో ప్రకారమే భూములు ఇస్తున్నాం. భూమి హక్కులు ఉన్న వారికి మేలు చేయాలని చూస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో చాలా భూములు బదిలీ చేశారు. పరిశ్రమలకు ఉపయోగపడాలని గ్రిడ్ పాలసీ తీసుకున్నారని అనుకున్నాం. పారిశ్రామిక వేత్తలను ఇబ్బంది పెట్టకూడదు. పెట్టుబడులు రావాలని రాయితీలతో కూడిన పాలసీలు తీసుకుంటాం. కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే భూములు ఇస్తున్నారు. పెట్టుబడులు రావాలి, ఉపాధి పెంచాలి అనేది మా లక్ష్యం. ఫ్రీహోల్డ్ ల్యాండ్ ఉన్నవారు పాలసీ ద్వారా అవకాశం ఉంటే దరఖాస్తు చేసుకుంటారని అన్నారు. భారత రాష్ట్ర సమితి నేతలు అభూత కల్పనలతో రాష్ట్ర ప్రజలకు సత్యదూరమైన మాటలు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత ఆ పార్టీ నేతలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. పెట్టుబడులు రాకూడదు, రాష్ట్ర అభివృద్ధి జరగకూడదు అనేది కేటీఆర్ ఆలోచన. ఆధారాలు ఉంటేనే మాట్లాడాలి. కేటీఆర్ కొంత మంది పేర్లు చెప్పారు.. వారు ప్రభుత్వంలో లేరు. ఆధారాలు ఉంటే చెప్పండి.. చర్యలు తీసుకుంటాం అని శ్రీధర్‌బాబు తెలిపారు.

## రాయపూర్‌లో మూడ్రోజుల పాటు డిజిపిల సమావేశం

● హాజరవుతున్న ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు

**రాయపూర్,నవంబర్21ప్రజావినికిడి,** ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈ నెల 28 నుంచి 30 వరకు అన్ని రాష్ట్రాల డీజీపీల సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, సీనియర్ అధికారులు పాల్గొంటారు. ఈ వార్షిక సమావేశంలో ప్రధానంగా ఆపరేషన్ కగార్ పురోగతి, ఉగ్రవాద దాడుల నిరోధక వ్యూహాలు ప్రధాన అజెండాగా ఉండనున్నాయని తెలిసింది. మావోయిస్టుల లొంగుబాట్లు, వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని, కేంద్ర హోంమంత్రి హాజరవుతుండటంతో సమావేశానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ప్రత్యేక కమాండోలు, సీఆర్‌పీఎఫ్, ఎన్ఐఏ, ఐబీ బృందాలు రాయ్‌పూర్ చేరుకుని వ్యూహాత్మక భద్రతా ప్రణాళికను అమలు చేస్తున్నాయి. ఈ సమావేశానికి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి తదితరులు హాజరుకానున్నారు. శాటిలైట్ నిఘా, డ్రోన్ పెట్రోలింగ్, గ్రౌండ్ ఆపరేషన్స్ ను మరింత సమర్థవంతంగా మార్చడంపై కీలక నిర్ణయాలు తీసుకుంటారని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఇటీవలి వరుస ఎన్‌కౌంటర్లు, హిడ్మా తదితరుల హతం తరవాత దీనికి ప్రత్యేకత ఏర్పడింది.

## తెలంగాణలో భారీగా ఐపిఎస్‌ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

మహబూబాబాద్ ఎస్పీగా శబరీష్, కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీగా నిఖిత, టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా గిరిధర్, వికారాబాద్ ఎస్పీగా స్నేహా మిశ్రా బదిలి అయ్యారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా గైక్వాడ్ వైభవ్, ములుగు ఎస్పీగా కేకన్ సుధీర్ రామ్‌నాథ్, జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా సంకీర్త్, గవర్నర్ ఏడీసీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, పెద్దపల్లి డీసీపీగా రామ్ రెడ్డి, మల్కాజ్‌గిరి డీసీపీగా సీహెచ్ శ్రీధర్, భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ ఎస్పీగా అవినాష్ కుమార్, భువనగిరి అడిషనల్ ఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి, జగిత్యాల అడిషన్ ఎస్పీగా శేషాద్రిని రెడ్డి, ములుగు అడిషనల్ ఎస్పీగా శివం ఉపాధ్యాయ, ఆదిలాబాద్ అదనపు ఎస్పీగా మౌనిక, ఏటూరు నాగారం ఏఎస్పీగా మనన్ భట్, నిర్మల్ ఏఎస్పీగా సాయికిరణ్, వేములవాడు ఏఎస్పీగా రుత్విక్ సాయి, సత్తుపల్లి ఏసీపీగా యాదవ్ వసుంధర, టీజీ ట్రాన్స్‌కో ఎస్పీగా శ్రీనివాస్, వనపర్తి ఎస్పీగా సునీత నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ట్రేడ్ లైసెన్స్ ఫీజులో మోసం

● అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలకు నోటీసులు




**హైదరాబాద్నవంబర్21ప్రజావినికిడి,** అన్నపూర్ణ స్టూడియో, రామానాయుడు స్టూడియోలకు జిహెచ్ఎంసి నోటీసులు జారీ చేసింది. ఇరు సంస్థలు ట్రేడ్ లైసెన్స్ ఫీజ్ తక్కువగా చెల్లిస్తున్నాయని, వ్యాపార విస్తీర్ణం తక్కువ చూపిస్తూ భారీగా ట్యాక్స్ ఎగవేస్తున్నట్లు జిహెచ్ఎంసి అధికారులు గుర్తించి శుక్రవారం నోటీసులిచ్చారు. పూర్తి స్థాయిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలంటూ జిహెచ్ఎంసి అధికారులు నోటీసులిచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అవసరం లేని అన్నపూర్ణ, రామానాయుడు సంస్థలు ట్యాక్స్ ఎగవేస్తున్నాయ ంటూ వార్తలు రావడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఆ రెండు సంస్థల నుండి ఎలాంటి స్పందన రాలేదు. అన్నపూర్ణ స్టూడియో లక్షా 92 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వ్యాపారం చేస్తూ కేవలం 8 వేల100 చదరపు అడుగులకు మాత్రమే ట్యాక్స్ పే చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అన్నపూర్ణ స్టూడియో రూ. 11 లక్షల 52 లక్షలు ఫీజు చెల్లించా ల్సి ఉండగా, కేవలం రూ.49 వేలు మాత్రమే చెల్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రామానాయుడు స్టూడియో 68 వేల చదరపు అడుగుల్లో వ్యాపారం చేస్తూ? కేవలం 19 వందల చదరపు అడుగులకు ట్యాక్స్ పే చేస్తోందని.. రూ. 2 లక్షల 73 వేలు చెల్లించాల్సిన రామానాయుడు స్టూడియోస్ కేవలం 7 వేల 600 మాత్రమే చెల్లిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

## శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి

**తిరుమల,నవంబర్21ప్రజావినికిడి,:**రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్న రాష్ట్రపతి శుక్రవారం ఉదయమే దర్శనం చేసుకున్నా ఆలయ మహాద్వారం వద్ద ఆమెకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆమెకు వేదాశీర్వచనాలిచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. రాష్ట్రపతికి స్వామివారి చిత్రపటాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అందించారు.రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆలయం నుంచి పద్మావతి అతిథి గృహానికి బయలుదేరారు. దారి మధ్యలో రాంభగీచ వసతిగృహం వద్ద వాహనం దిగి అక్కడి భక్తులతో మాట్లాడారు. వారికి చాక్లెట్లు కూడా పంచారు. రాష్ట్రపతి రాకతో తిరుమలలో భారీగా భద్రత కల్పించారు. ఆమెపర్యటించిన ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టారు. అయితే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల పర్యటనలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది.. రాంభగీచ సర్కిల్ వద్ద ప్రోటోకాల్ పక్కన పెట్టేసి భక్తులను పలకరించారు రాష్ట్రపతి ముర్ము.. కాన్వాయ్ నుంచి దిగి రోడ్డు పక్కన నిలిచిఉన్న భక్తులను ప్రేమగా పలకరించిన రాష్ట్రపతి.. భక్తులతో కరచాలనం చేసి చా÷–లకెట్స్ పంపిణీ చేశారు.. ఇక, ఊహించని ఘటనతో భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.. అయితే, రాష్ట్రపతి అనూహ్యంగా కాన్వాయ్ దిగడంతో.. భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. రెండు రోజుల పర్యటన భాగంగా.. గురువారం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. ఆ తర్వాత తిరుమల చేరుకుని శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో బస చేశారు.. ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు.అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

## పంచాయితీ రిజర్వేషన్లపై కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం నివేదిక సమర్పించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను సర్క్యులేషన్ విధానంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. మంత్రుల వద్దకు ఫైలు పంపించి ఆమోదిస్తున్నట్లు సంతకాలు తీసుకున్నారు. ఈ క్రమంలో పంచాయతీలు, వార్డుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లపై విధివిధానాలు ఖరారు చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేయనుంది. జీవోకు అనుగుణంగా ఎంపీడీవోలు వార్డులకు, ఆర్డీవోలు సర్పంచి పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతిలో మహిళలకు సీట్లు కేటాయించనున్నారు. శని, ఆదివారాల్లో జిల్లాల యంత్రాంగం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయనుంది. రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికలకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని, పిటిషన్‌పై విచారణ ముగించాలని ఈనెల 24న హైకోర్టుకు ప్రభుత్వం, ఎస్ఈసీ తెలపనున్నాయి. హైకోర్టు అంగీకరిస్తే అదే రోజు లేదా మరుసటి రోజు షెడ్యూలు విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. మొత్తానికి ఇటీవల కేబినేట్‌లో ఆమోదించిన మేరకు డిసెంబర్ రెండోవారంలో నోటిఫికేషన్ విడుదల కానుంది.

## పూర్తికాలం సిఎంగా సిద్దరామయ్యే...

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తో డిన్నర్‌లో పాల్గొనడం ఈ ఊహాగానాలకు తెరతీసింది. అయితే డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఈ డ్రామాకు తెరదించారు. సీఎం సిద్ధరామయ్యేనని చెప్పారు. పూర్తికాలం ఆయనే సీఎంగా కొనసాగుతారని చెప్పారు. తామంతా ఆయనతో కలిసి పని చేస్తామని అన్నారు. ఖర్గేతో ఎమ్మెల్యేల సమావేశం గురించి ప్రశ్నించగా.. వాళ్లు పీసీసీ అధ్యక్ష పదవి, నాలుగైదు డిప్యూటీ సీఎం పదవులను కోరుకుంటున్నారని వ్యాఖ్యానిం చారు. ఇలాంటి మీటింగ్‌లు గత రెండున్నరేళ్లుగా కొనసాగుతున్నాయని డీకే చెప్పారు. ఇందులో కొత్తదనం ఏమీ లేదని అన్నారు. వాళ్లు ఇలాంటి మీటింగ్‌లు ఇంకా మరిన్ని పెట్టుకోనీయని వ్యాఖ్యానించారు.

## రాష్ట్రంలో భారీ భూకుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

బాలానగర్, కాటేదాన్, జీడిమెట్లలో రేవంత్ తన వాళ్లకు భూములి చ్చారని విమర్శించారు. మొత్తం నాలుగు లక్షల కోట్ల కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. జపాన్‌లో ఉన్నప్పుడు కూడా ఆ భూమికి సంబంధించిన ఫైల్‌పై రేవంత్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ప్రతి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తుందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం హైదరాబాద్‌లో అతిపెద్ద భూకుంభకోణానికి తెరలేపిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో 2022లో భూముల రెగ్యులేషన్ కోసం చట్టం తీసుకొచ్చామని, భూములకు వంద శాతం ఫీజులు చెల్లించేలా నిబంధన చేర్చామని కేటీఆర్ తెలిపారు. భూములు వేరేవాళ్లకు అమ్ముకుంటే రెండు వందల శాతం చెల్లించాలని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు పట్టించుకోకుండానే భూ కేటాయింపులు చేసిందని విమర్శించారు. 30 శాతం చెల్లిస్తే రెగ్యులర్ చేస్తామని ఉత్తర్వులు ఇచ్చారని ఆరోపించారు. ఇకపోతే రేవంత్ రెడ్డి నన్ను అరెస్టు చేసే ధైర్యం చేయరు. ఈ ఫార్ములా రేస్ కేసులో ఏమీ లేదని రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. ఏ తప్పూ చేయలేదు.. లై డిటెక్టర్ టెస్టుకైనా సిద్ధమే అని కేటీఆర్ పేర్కొన్నారు. కడియం శ్రీహరిని కాపాడేందుకు దానం నాగేందర్‌తో రాజీనామా చేయించే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే ప్రభుత్వం పరువు పోతుందని ముందుగానే ఎమ్మెల్యేలచే రాజీనామా చేయించేందుకు సిద్ధమవుతున్నారు. ముందుగా జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తాయి. ఆ తర్వాత ఉప ఎన్నికలు వస్తాయి అని కేటీఆర్ పేర్కొన్నారు.

## హైదరాబాద్ చేరుకున్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

(మొదటి పేజీ తరువాయి)

స్వాగతం పలికిన వారిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హైదరాబాద్ సీపీ సజ్జనార్‌లు ఉన్నారు. తిరుపతి నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి తిరిగి శనివారం పుట్టపర్తి వెళ్లనున్నారు.

## మావోయిస్ట్ అగ్రనేతల విడుదలపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

తేల్చిచెప్పింది. పోలీసుల వద్ద ఆ ఇద్దరు అగ్రనేతలు ఉన్నారనే దానిపై ఆధారాలు లభిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు పిటిషనర్లకు వెసులుబాటు కల్పించింది. ఆపై మావోయిస్ట్ నేతల బంధువులు వేసిన పిటిషన్‌పై విచారణను ధర్మాసనం మూసివేసింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు దేవ్ జీ, మల్లా రాజిరెడ్డిని కోర్టులో హాజరుపరచాలని పోలీసులను ఆదేశించాలని కోరుతూ రాజారెడ్డి కుమార్తె స్నేహలత, దేవ్ జీ సోదరుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. దీనిపై గురువారం హైకోర్టులో విచారణ జరిగిన విషయం తెలిసిందే. మావోయిస్టు కీలక నేతలు తమ ఆధీనంలో ఉన్నారని పోలీసులు ప్రెస్‌స్టేట్‌మెంట్ ఇచ్చారని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలుపగా.. ఆధారాలు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. దీంతో నేటి విచారణలో పోలీసుల ప్రెస్ స్టేట్‌మెంట్‌కు సంబంధించిన వీడియోను పిటిషనర్ల తరుపు న్యాయవాది కోర్టుకు సమర్పించారు. వీడియోను చూసిన ధర్మాసనం.. సెక్యూరిటీ సిబ్బంది తమ అదుపులో ఉన్నారని పోలీసులు చెప్పినట్లు గుర్తించింది. దేవ్ జీ గురించి మీడియా ప్రతినిధులు అడగ్గా.. తమ ఆధీనంలో లేరని పోలీసు ఉన్నతాధికారులు చెప్పినట్లు వీడియోలో ఉందని న్యాయస్థానం గుర్తించింది. దీంతో దేవ్ జీ, రాజిరెడ్డిలు పోలీసుల నిర్బంధంలో ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు లేవని ధర్మాసనం నిర్ధారించింది. ఈ వ్యాజ్యంలో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేస్తూ.. పిటిషన్‌ను క్లోజ్ చేసింది.

## భారీగా పెరిగిన యాదాద్రి ఆదాయం

● కార్తీకంలో 20 లక్షల 52 వేల మంది దర్శనం



**యాదాద్రి,నవంబర్21ప్రజావినికిడి,:** కార్తీక మాసం నేపథ్యంలో యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని భారీగగా భక్తులు దర్శించుకున్నారు. దేవాలయంలో భక్తుల రద్దీ ఎప్పటి లాగే భారీ స్థాయిలో నమోదైంది. ఈ మాసంలో స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 20 లక్షల 52 వేల దాటింది. భక్తుల సంఖ్య పెరగడంతో దేవాలయ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ఈ కార్తీక మాసంలో యాదాద్రికి వచ్చిన మొత్తం ఆదాయం రూ.17 కోట్లు 62 లక్షలు 33 వేల 331. గతేడాది ఇదే కాలంలో వచ్చిన ఆదాయం రూ. 14 కోట్లు 30 లక్షలు 69 వేల 481. అంటే ఈసారి గతేడాదితో పోలిస్తే రూ. 3 కోట్లు 31 లక్షలు 63 వేల 850 అదనపు ఆదాయం స్వామివారి దేవాలయానికి వచ్చింది. అధిక భక్తులు, సేవలు, విరాళాలు, ప్రాసాద అమ్మకాల కారణంగా ఆదాయం పెరిగిందని దేవస్థానం అధికారులు పేర్కొంటున్నారు. కార్తీక మాసంలో యాదాద్రి యాత్రకు భక్తుల విశ్వాసం, ఆసక్తి ఏ స్థాయిలో ఉందో ఈ సంఖ్యలు మరోసారి రుజువు చేస్తున్నాయి.

## దుయాయ్ ఎయిర్ షోలో ప్రమాదం


(మొదటి పేజీ తరువాయి)

పైలట్ ప్రమాదం నుంచి బయటపడ్డాడా..? లేదా..? అన్నది స్పష్టంగా తెలియలేదు. కానీ, ప్రమాద తీవ్రతను చూస్తుంటే పైలట్ బతికే ఛాన్స్ లేదనే తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృష్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కూడా ఎలాంటి ప్రకటనా చేయలేదు. కాగా, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ యుద్ధ విమానాన్ని బెంగళూరులోని హిందూస్తాన్ ఎరోనాటికల్ లిమిటెడ్ తయారు చేసింది.

## రైతుల ఆత్మహత్యపై స్పందించరేం

● ధరణి పోయి భూమాత వచ్చినా సమస్యలు పరిష్కరించరా..?

● సిఎం రేవంత్ రెడ్డి తీరుపై హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్,నవంబర్21ప్రజావినికిడి,** ఒక్క రైతు కూడా భూ సమస్య వల్ల ఆత్మహత్య చేసుకోకూడదు. రైతుల భూమి హక్కులు 100 శాతం కాపాడతాం అని ఎన్నికల ప్రచారంలో అదరగొట్టిన రేవంత్ రెడ్డికి మీ పార్టీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల వద్ద, తహసిల్దార్ కార్యాలయాల వద్ద జరుగుతున్న రైతు ఆత్మహత్యాయత్నాలు కనిపించడం లేదా అని మాజీ మంత్రి హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. అధికారం లోకి వస్తే 3 నెలల్లో భూమి సమస్యలు పరిష్కరిస్తాం అన్న హామీ ఏమైంది రేవంత్ రెడ్డి అని నిలదీశారు. భూముల రికార్డులు సరిచేస్తాం, రైతుల హక్కులు కాపాడతాం అని చెప్పి మీరు రెండేళ్లుగా కుంటి సాకులు చెబుతూ రిజిస్ట్రేషన్లు చేయకుండా రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. రైతు భూమి మీద ఆ రైతుకే హక్కు లేకుండా చేస్తున్న దుర్మార్గ ప్రభుత్వం మీది. ఇది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం. ఆపదకో, అవసరానికో ఉన్న భూములు అమ్ముకోలేక.. అధిక వడ్డీకి రుణాలు తీసుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.ప్రజా పాలన దరఖాస్తులు ఏమయ్యాయి? రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని అన్నారు. ధరణి పేరు మార్చి తెచ్చిన భూ భారతి ఏమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే మీ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? నెలల తరబడి రెవెన్యూ ఆఫీసులు,కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా రైతులు, ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారమవడం లేదు. ఇప్పటికే మీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల 700 పైగా అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు. రుణమాఫీ కాక, రైతు భరోసా అందక, పంట బోనస్ ఇవ్వక పోవడంతో రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రెవెన్యూ శాఖ మేలుకుని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, రైతు ఆత్మహత్యలు చేసుకోకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## స్పోర్ట్స్ విజేతలకు సిఎం రేవంత్ అభినందనలు



**హైదరాబాద్,నవంబర్21ప్రజావినికిడి,**4వ ఇఎంఆర్ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్-2025లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించిన తెలంగాణ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇఎంఆర్ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్-2025లో రికార్డ్-బ్రేకింగ్ మెడల్స్ సాధించిన తెలంగాణ అథ్లెటిక్స్, ఆర్చరీ, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్, జూడో, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, టైక్వాండో, యోగా, షూటింగ్, చెస్ ఇతర ఈవెంట్లలో అన్ని రాష్ట్రాలకంటే అత్యధికంగా 230 పతకాలను తెలంగాణ సాధించింది. నవంబర్ 15న ఒడిశాలో జరిగినఈ పోటీల్లో తెలంగాణలోని 23 సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.. దేశవ్యాప్తంగా ఈ జాతీయ క్రీడా పోటీల్లో 22 రాష్ట్రాలలోని 499 సంస్థలకు చెందిన 5,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 22 ఈవెంట్లలో పోటీలు నిర్వహించగా ఇందులో వ్యక్తిగత ఈవెంట్లు - 15, జట్టు ఈవెంట్లు 07, తెలంగాణ తరపున ఈ జాతీయ ఈవెంట్‌లో 23 పాఠశాలలకు చెందిన 580 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత, జట్టు ఈవెంట్లలో అత్యుత్తమ ప్రదర్శనను తెలంగాణ విద్యార్థులు ప్రదర్శించారు.మొత్తం 714 పాయింట్లతో అద్భుతమైన ఛాంపియన్‌షిప్‌ను తెలంగాణ కైవసం చేసుకున్నది .

# పార్కు స్థలమును రిజిస్ట్రేషన్ చేసిన ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ సస్పెండ్..

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
పార్కు స్థలమును అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ ను సస్పెండ్ చేయడం జరిగింది. అలాగే త్వరలోనే రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు రద్దు చేయడం జరుగుతుంది. వినియోగంలో ఉన్న పార్కును కబ్జా చేసేందుకు చూసిన వ్యక్తులపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి అని స్థానిక జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీలో వినియోగంలో ఉన్న శ్రీ చత్రపతి శివాజీ పార్కును అక్రమంగా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అట్టి రిజిస్ట్రేషన్ లను వెంటనే రద్దు చేయాలని బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కాలనీ వాసులతో కలిసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిహెచ్ఎంసి పరిధిలోని బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ శ్రీపురం కాలనీలో సుమారు 5000 గజాల స్థలాన్ని పార్కు కోసం అలాగే కొన్నిచోట్ల కమిటీ హాల్ కోసం,క్రీడా ప్రాంగణం కోసం స్థలాలను వదిలి పెట్టడం జరిగింది. అందులో భాగంగా పార్కు స్థలములో ప్రభుత్వం నుంచి లక్షల రూపాయలు వెచించి పార్కు స్థలమును అభివృద్ధి చేయడం జరిగింది.అట్టి స్థలములను కొందరు వ్యక్తులు వనస్థలిపురం ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ తో కలిసి అక్రమంగా తప్పుడు పత్రాలు సృష్టించి వనస్థలిపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది. ఇట్టి సమస్యను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన కార్పొరేటర్ వెంటనే ఇట్టి సమస్యను తెలంగాణ రాష్ట్ర సమాచార, రెవెన్యూ,గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ దృష్టికి తీసుకు వెళ్లి వెంటనే సమస్యను పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి ఎంపీ చొరవతో పూర్తి స్థాయిలో విచారణ జరిపించి తప్పుడు రిజిస్ట్రేషన్ కు సహకరించిన ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ ను వెంటనే సస్పెండ్ చేయడం జరిగింది అలాగే త్వరలోనే ఇట్టి రిజిస్ట్రేషన్ పత్రాలను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేయడం జరిగింది,అలాగే తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తుల పైన చట్టపరమైన అదేవిధంగా న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కోరడం జరిగింది.
ఇట్టి రిజిస్ట్రేషన్ సమస్యను వెంటనే పరిష్కరించిన గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి,ముత్యమ్ రావు,మహేందర్ రెడ్డి, కృష్ణా రెడ్డి,సికిందర్ రెడ్డి,విష్ణు వర్ధన్ రెడ్డి,విఠల్ రెడ్డి, అరవింద్ రెడ్డి,పాండు రంగం,వెంకట్ రెడ్డి, రాజేందర్,వెంకట్ రమణారెడ్డి,సురేందర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, నరసింహారెడ్డి,విద్యాదర్ తదితరులు ఉన్నారు.

# సైబర్ మోసంతో విదేశాల్లో చిక్కుకున్న 269 మందిని రక్షించిన భారత్..



**ప్రజావినికిడి, (హైదరాబాద్):**దక్షిణ ఆసియాలో సైబర్ నేరాలకు సంబంధించిన మోసం కేంద్రాల్లో చిక్కుకున్న భారతీయుల విడుదల చేసి తిరిగి స్వదేశానికి చేర్చడానికి భారత ప్రభుత్వ ప్రయత్నాలు వేగంగా కొనసాగుతున్నాయనీ పేర్కొంది.బ్యాంకాక్లోని భారత రాయబార కార్యాలయం, చియాంగ్ మాయిలోని భారత కాన్సులేట్ మద్దతుతో నవంబర్ 18న రెండు ప్రత్యేక భారత వాయుసేన విమానాలు థాయ్లాండ్ సరిహద్దు పట్టణం మే సాట్ నుండి 11 మంది మహిళలతో సహా 269 మంది భారతీయులను స్వదేశానికి తిరిగి తరలించాయనీ తెలిపింది.ఈ ఆపరేషన్ థాయ్లాండ్, మయన్మార్ లోని భారత మిషన్లు,థాయ్ ప్రభుత్వానికి చెందిన వివిధ ఏజెన్సీల సమన్వయంతో చేపట్టనట్లు వెల్లడించింది. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో భారత రాయబారం పేర్కొంటూ నేడు బ్యాంకాక్ లోని భారత రాయబార,చియాంగ్ మాయిలోని భారత కాన్సులేట్,రాయల్ థాయ్ ప్రభుత్వం,టాక్ ప్రావిన్స్ అధికారుల సహకారంతో మే సాట్, థాయ్లాండ్ నుండి భారత వాయుసేన నిర్వహించిన రెండు ప్రత్యేక విమానాల ద్వారా 11 మంది మహిళలతో సహా 269 మంది భారతీయులను స్వదేశానికి పంపడంలో సహాయపడ్డాయనీ పేర్కొంది.

# ఘనంగా ప్రారంభమైన సఖి బజార్ ఎగ్జిబిషన్



**ప్రజావినికిడి,(నాగోల్):** నాగోల్ పరిధిలోని పీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో శుక్రవారం సఖి ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైనది.శుక్ర శనివారాల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ను నిర్వాహకురాలు శ్రీగిరి తరుణి వెంకటమాధవరెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పడాల శ్రీకాంత్,నూకల పద్మారెడ్డి,శిల్పారెడ్డిలు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఇందులో ఫ్యాషన్కు సంబంధించి ఉంచిన స్టాళ్లను సుమారు 10వేల మంది సందర్శించి తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసినట్లు శ్రీగిరి వెం కటరమణారెడ్డి పేర్కొన్నారు.ఇక్కడ మహిళలకు సంబంధించిన అన్ని రకాల జ్యువెలర్స్ వివిధ ఫ్యాషన్ డిజైన్ దుస్తులు అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఆర్విఎం ఎంబీబీఎస్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్,రోడ్డు ప్రమాదాలు..

# యాంటీ ర్యాగింగ్,యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం





**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
ఆర్విఎం హాస్పిటల్ లో గురువారం రోజు ఎంబీబీఎస్ విద్యార్థులకు మేడ్చల్ ట్రాఫిక్ ఏసిపి కే.వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్,రోడ్డు ప్రమాదాలు %ఁ% యాంటీ ర్యాగింగ్,యాంటీ డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ,డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు. చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని కాబట్టి విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల గురించి హితవు పలికారు.ఆదేవిదంగా విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడితే చట్టపరంగా ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. విద్యార్థులందరూ తమ తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలని, సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని తెలిపారు.లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని డ్రైవింగ్ చేస్తున్నప్పుడు పాటించవలసిన రహదారి నియమ నిబంధనలను విద్యార్థులకు వివరణాత్మకంగా వివరించారు.ఈ కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శంకర్,ములుగు ఎస్ ఐ రఘుపతి,మెడికల్ కాలేజీ డీన్స్ ఓ.శ్రావణ్ కుమార్,గోపీ కృష్ణ, సీఈఓ శ్రీనివాస్, విజిలెన్స్ ఆఫీసర్ కె. రవి కుమార్, సీ ఎస్ ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి సైన్స్ సంబరాలు



**ప్రజావినికిడి,(వాజేడు):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాజేడు నాగారంలో సమగ్ర శిక్ష తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,జన విజ్ఞాన వేదికల ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు 2025,ను నిర్వహించారు. పాఠశాల స్థాయిలో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు మండల కేంద్రంలో శుక్రవారం రోజు పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది.ఈ పోటీలలో జిల్లా పరిషత్ పాఠశాలల విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.అక్షిత,సి హెచ్ మహేష్ లు ప్రథమ స్థానం,డి.రాణా ప్రతాప్,పి.దుర్గాశ్రీ ద్వితీయ స్థానం, ఆశ్రమ పాఠశాలల విభాగంలో ఎహెచ్ఎస్ పేరూరు విద్యార్థులు పి.ఉదయకుమార్, జె.సాత్విక్ ప్రథమ స్థానం,ఎజిహెచ్ఎస్ విద్యార్థినిలు టి.జ్యోశ్నవి,కె.తన్మయ ద్వితీయ స్థానం పొందారు.ఈ సందర్భంగా పోటీలలో పాల్గొన్న విద్యార్థినీ,విద్యార్థులను ఉద్దేశించి మండల విద్యాధికారి తేజావత్ వెకటేశ్వరరావు మాట్లాడుతూ,విద్యార్థులు చదువులో పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని, నిత్యం శాస్త్రీయ విజ్ఞానాన్ని అధ్యయనం చేయాలని అన్నారు. తదనంతరం విజేతలైన జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు మండల విద్యాధికారి తేజావత్ వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోయం ఆనందరావు తో కలసి ప్రశంసా పత్రాలను అందజేస్తూ జిల్లా స్థాయిలో రాణించాలని ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.వేణుగోపాల్ మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల,ఆశ్రమ పాఠశాలల గైడ్ టీచర్లు చల్లగురుగుల మల్లయ్య, బుచ్చిబాబు,పవన్, ఎస్.ఓ.సుజాత స్కూల్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# బూటకపు ఎన్కౌంటర్లపై సమగ్ర విచారణ చేపట్టాలి

## కూనంనేని సాంబశివరావు




**ప్రజావినికిడి, (ముషిరాబాద్):**
ప్రధాని మోదీ,కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ మనుషులను ఉచకోతకు పాల్పడుతుంటే,సుప్రీం కోర్ట్ మౌనంగా ఉండడం బాధకరమని, ఇప్పటికైనా బూటకపు ఎన్కౌంటర్లపైన న్యాయ వ్యవస్థ సుమోటోగా స్వీకరించి సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు.బూటకపు ఎన్ కౌంటర్లను తక్షణమే నిలిపివేసి,మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బూటకపు ఎన్ కౌంటర్ల కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టనున్నట్టు వెల్లడించారు. 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తానని ప్రకటించిన కేంద్ర మంత్రి అమిత్ షా, ముందుగా దేశంలో ఉన్న అవినీతిని, నిరుద్యోగాన్ని, పాకిస్తాన్ తీవ్రవాదాన్ని అంతం చేస్తామని సవాల్గా తీసుకోవాలని హితువుపలికారు. "మావోయిస్టులను బిజెపి ప్రభుత్వం బూటకపు ఎన్ కౌంటర్ల ద్వారా చంపడాన్ని" ఖండిస్తూ 'బూటకపు ఎన్ వ్యతిరేక పోరాట కమిటీ'ఆధ్వర్యంలో వామపక్ష, రాజకీయ పార్టీలు,మేధావులు, ప్రజా సంఘాలు,పౌర హక్కుల ప్రతినిధులు హైదరాబాద్ లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. "ఎన్ కౌంటర్ల న్ని ప్రభుత్వ హత్యలేనని,కగార్ ఆపరేషన్ వ్యతిరేకంగా పోరాడాలని,ఎన్ కౌంటర్ల ను ఆపాలని, అటవీ సంపదను కాపాడాలని" ప్లకార్డలను ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ,నిత్యం ప్రజల కోసం పనిచేస్తూ,కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే తాము దేశ ద్రోహులమా?లేదా ప్రజాధనాన్ని,ఖనీజ సంపదను కూలగొట్టే పాలకులు,వేల కోట్ల రూపాయాలకు ఎదిగే అంబానీలు,అదానీలు దేశ భక్తులాని నిలదీశారు. మావోయిస్టులను చంపినంత మాత్రానా సమస్య పరిష్కారం కాదని,ముందుగా ఆ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్ కౌంటర్ల పట్ల చాలా మంది మూగ వేదనకు ప్రతీకగా తాము నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. మోదీ ప్రభుత్వ అరాచకం తాండవిస్తోందని, రాజ్యాంగానికి విఘాతం కలిగిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.బూటకపు ఎన్ కౌంటర్ల ప్రశ్నించినందుకు తనపైన బిజెపి,ఆర్ ఎస్ ఎస్ అనుకూల సోషల్ మీడియాలో స్పందిస్తూ,తనను కూడా చంపాలంటూ పోస్టులు పెడుతున్నారన్నారు. శ్రీలంక,నేపాల్, బంగ్లాదేశ్ తరహా ప్రజలే మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని కూనంనేని హెచ్చరించారు. టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామిక స్వభావానికి బూటకపు ఎన్ కౌంటర్ల ఒక గొడ్డలిపెట్టు లాంటిదన్నారు. కార్పొరేట్ శక్తులకు కేంద్రం మితిమిరిన లాభాలను కల్పిస్తుందని,దీనిని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? అని మండిపడ్డారు. రాజ్యాంగానికి, చట్టానికి విరుద్ధంగా బూటకపు ఎన్ కౌంటర్ల చేసినందుకు అధికారులపైన కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ మాట్లాడుతూ మావోయిస్టులను చంపేస్తామనడమే రాజ్యాంగం,చట్టానికి వ్యతిరేకమని మండిపడ్డారు. మనుషులను చంపే అధికారం కేంద్రానికి ఎవరిచ్చారని నిలదీశారు.కేంద్రం వెంటనే కగార్ ఆపరేషన్ నిలిపి వేసి, ఎన్ కౌంటర్ న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో స్టేట్ అసిస్టెంట్,ఈటీ నర్సింహ,స్టేట్ ఎక్స్క్యూటివ్ మెంబర్ ఛాయదేవి తదితరులు పాల్గొన్నారు.

### 'ప్రధానమంత్రి ఉచిత స్కూటీ స్కీం':

# ప్రచారాన్ని నమ్మవద్దని కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక

## ఉచిత స్కూటీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురాలేదని స్పష్టీకరణ

**నవంబర్21,ప్రజావినికిడి,**
'ప్రధానమంత్రి ఉచిత స్కూటీ యోజన' పేరుతో కేంద్ర ప్రభుత్వం పథకం అమలు చేస్తోందంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలో నిజం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కళాశాలలకు వెళ్లే యువతులకు ఉచితంగా స్కూటీలను పంపిణీ చేస్తోందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి స్కాంల ఉచ్చులో పడవద్దని హెచ్చరించింది.ఈ ప్రచారంలో నిజం లేదని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం అలాంటి పథకాన్ని తీసుకురాలేదని తెలిపింది.అధికారిక సమాచారం కోసం పీఐబీ ఫ్యాక్ట్ చెక్ లేదా సంబంధిత మంత్రిత్వ శాఖల వెబ్సైట్లను సందర్శించాలని సూచించింది. వాట్సాప్, ఎస్సెమ్మెస్ లేదా ఈ-మెయిల్ ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని కేంద్రం హెచ్చరిస్తోంది.



## ఘనంగా అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం




**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్) :** అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గంగపుత్ర చైతన్య సమితి ఆధ్వర్యంలో ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.రాష్ట్ర అధ్యక్షులు మంగిలిపల్లి శంకర్ గంగపుత్ర సారథ్యంలో ట్యాంక్ బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి,రాష్ట్ర వ్యాప్తంగా గంగపుత్రుల హక్కులు కాలరాయబడుతున్నాయని పేర్కొంటూ.. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు.అదే విధంగా నేడు తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ అలాగే హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కూడా ఈ యొక్క వినతి పత్రాలను సమర్పించా రు.ఈ యొక్క వినతిపత్రంలో గంగపుత్రులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పేర్కొంటూ..ఈ క్రింది డిమాండ్ లను చేశారు.చేపలు పట్టే ప్రతీ కులం మత్స్యకార కులం కాదు.సనాతన సంప్రదాయ మత్స్య కారులు బెస్త గూండ్ల గంగపుత్రులు మాత్రమే.గంగపుత్రుల కులవృత్తి రక్షణకు ప్రత్యేక చట్టం ద్వారా రక్షణ కల్పించాలి.ఈ యొక్క కార్యక్రమంలోరాష్ట్ర అధ్యక్షులు శ్రీ మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర,ప్రధాన కార్యదర్శి కైరంకొండ నర్సింగ్ గంగపుత్ర,స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ పూస సత్యనారాయణ గంగపుత్ర,ఉపాధ్యక్షులు పూస శ్రీనివాస్ గంగపుత్ర, మానుకోల సురేష్ గంగపుత్ర,కార్యదర్శులు ఎర్రబోయిన ప్రవీణ్ గంగపుత్ర,దువ్వల శ్రీకాంత్ గంగపుత్ర, పూస రవి గంగపుత్ర, రివర్ సైడ్ గంగపుత్ర యువజన సంఘం అధ్యక్షులు శశాంక్ గంగపుత్ర,బోన్ మోన్ రాకేష్,గుండు మహేందర్,పూస రాజు,నగేష్, రామకృష్ణ,యాదగిరి వివిధ జిల్లాల గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.21 లక్షల నష్టపరిహారం

### మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన బొల్లారం నాయకులు

### పరిశ్రమ ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ. 21 లక్షల నష్టపరిహారం ఇప్పించేందుకు ఒప్పందం

**ప్రజావినికిడి,(బొల్లారం):**గురువారం మధ్యాహ్నం బొల్లారం మున్సిపల్ పరిధిలోని రాణే డై కాస్టింగ్ పరిశ్రమలో పనిచేస్తున్న కృష్ణ సింగ్ అనే కార్మికుడు ప్రమాదవశాత్తూ పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.దీంతో మరణించిన వ్యక్తి కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చేందుకు పరిశ్రమ యాజమాన్యం మొదట్లో ఒప్పుకోలేదు.దీంతో బొల్లారం కాంగ్రెస్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి, మున్సిపల్ బి.జె.పి అధ్యక్షులు ఆనంద్ కృష్ణ రెడ్డి, రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి వెళ్లి పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపేందుకు యత్నించారు. యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో స్థానిక నాయకుల అనుచరులు శుక్రవారం తెల్లవారుజామున పరిశ్రమలో పనిచేయడానికి వస్తున్న కార్మికులను విధుల్లోకి రాకుండా అడ్డుకున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేశారు.దీంతో దిగివచ్చిన యాజమాన్యం చర్చలు జరిపి,మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ. 21లక్షల రూపాయలు చెల్లించేందుకు అంగీకరించింది. తక్షణమే అంత్యక్రియల కోసం లక్ష రూపాయలు



ఇచ్చారు.మిగిలిన మొత్తాన్ని రెండు విడతలుగా ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది.

ఈ చర్చల్లో పరిశ్రమ యాజమాన్యం తరపున శివ రెడ్డి, మృతుడి తరపున మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, బొల్లారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.చంద్రారెడ్డి,గుండ్ల మహేందర్ రెడ్డి, మున్సిపల్ బి.జె.పి అధ్యక్షులు ఆనంద్ కృష్ణ రెడ్డి, కార్మిక సంఘం నాయకుడు వి.వరప్రసాద్ రెడ్డి, స్థానిక మున్సిపల్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిన కుటుంబ సభ్యులకు న్యాయం చేయడానికి సహకరించిన కంపెనీ కార్మిక సోదరులకు, అలాగే ఎలక్ట్రానిక్ మీడియా,ప్రింట్ మీడియా సోదరులకు అందరికీ స్థానిక నాయకులు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## షాద్ నగర్ పట్టణం ఫరూఖ్ నగర్ లో పోలీసుల కార్డెన్ సెర్చ్..

### సరైన పత్రాలు లేని 30 మోటర్ సైకిళ్ళు,ఆరు బెల్టు షాపు సీజ్..





**ప్రజా వినికిడి,(షాద్ నగర్)):** ర రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మునిసిపాలిటీ ఫరూక్ నగర్ లో పోలీసుల కార్డన్ సెర్చ్ నిర్వహించారు.కార్డెన్ సర్చ్ తనీఖీల్లో పాల్గొన్న డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ పూర్ణచందర్,ఏసీపీ లక్ష్మి నారాయణ,234 పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.డిసిపి రాజేష్ మాట్లాడుతూ, పోలీసుల తనిఖీల్లో 6 బెల్ట్ షాపులపై కేసులు, రెండు గుట్కా కేసులు,30 సరైన పత్రాలు లేని బైకులు సీజ్ చేశారు.కార్డెన్ సర్చ్ అనేది ప్రజల్లో భద్రతను పెంపొందించేటందుకు మాత్రమే అన్నారు.అక్రమార్కులను,నేరచరిత్ర కలిగిన వారిని గుర్తించేటందుకు ఈ తనిఖీలు తరచూ నిర్వహిస్తామన్నారు. షాద్ నగర్ ఒక్కటే కాకుండా చుట్టుపక్కల ఉండే కొత్తూరు, నందిగామ స్థలాల్లో కూడా కార్డెన్ సర్చ్ తరచుగా నిర్వహిస్తూ ఉంటాం,పబ్లిక్ ఉండే బహిరంగ ప్రదేశాల్లో మందు తాగే పదిమందిపై కేసులు పెట్టాం,మా కార్డెన్ సర్చ్ కు సహకరించిన ప్రజలందరూ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్డెన్ సర్చ్ లో ఏసిపి లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ విజయ్ కుమార్,రూరల్ సీఐ శ్రీనివాస్,డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు,ఎస్సైలు కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

## 18 ఏళ్ల తర్వాత షాద్ నగర్ కోర్టులో హాజరైన బీజేపీ నాయకులు

### :దేశభక్తి నినాదాలపై పెట్టిన కేసును జడ్జి కొట్టివేసి స్వచ్ఛమైన తీర్పు



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**అది 2008 డిసెంబర్ 6 న జరిగిన సంఘటన సందర్భంగా "భారత్ మాతాకీ జై, జై శ్రీరామ్" అని నినాదాలు చేసినందుకే బీజేపీ నాయకులపై పెట్టిన కేసు విచారణలో భాగంగా ఈ రోజు షాద్ నగర్ కోర్టులో నాయకులు హాజరయ్యారు. మొత్తం16 మందిలో 14 మంది కోర్టుకు హాజరై,18 ఏళ్లుగా తప్పుడు ఆరోపణలతో నడిపిన కేసుపై తమ నిర్దోషిత్వాన్ని ధైర్యంగా వ్యక్తం చేశారు. వారిలో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,పి.కృష్ణ రెడ్డి,నందిగాం వెంకటేష్, అశోక్ గౌడ్,వెంకటేష్ గుప్త,ఏ.నరసింహా గౌడ్, బాల్వాన్తు రెడ్డి, దివిటి వెంకటేష్,రాఘవులు, వెంకటేష్ యాదవ్,కుమారు, శ్రీరామ్ యాదవ్,కొండల్ రెడ్డి,వీర ఆంజనేయులు రెడ్డి తదితరులు ఉన్నారు.ఈ దీర్ఘ న్యాయ ప్రయాణంలో పరమపదించిన వనం ఝాన్సీ,ఖాజాన్న గౌడ్ ని నాయకులు భావపూర్వకంగా స్మరించారు.కేసుకు సంబంధించిన న్యాయ ప్రక్రియలను అడ్వకేట్ మహేందర్ రెడ్డి,మనోహర్ రెడ్డి,మురళి నిబద్ధతతో పర్యవేక్షించారు.

**"మా గొంతులను నొక్కలేరు!" నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఘాటైన వ్యాఖ్య**

ఈరోజు కోర్టు కేసును అధికారికంగా కొట్టివేయడంతో,నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ధృడంగా స్పందిస్తూ"దేశభక్తిపై పెట్టిన తప్పుడు కేసులు ప్రజల మనసుల్లోని జాతీయ భావాన్ని ఎప్పటికీ అణగదొక్కలేవు. ప్రభుత్వాలు మారవచ్చు..కానీ భారత్ మాత పట్ల ఉన్న మా నిబద్ధతను ఎవరూ ఆపలేరు అని ఘాటుగా పేర్కొన్నారు.

## ఆర్ ఆర్ ఆర్ రోడ్డుకు కేంద్రం నిధులు ఇస్తే

## జీర్ణించుకోలేకపోతున్న కల్వకుంట్ల కవిత

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**బిజెపి పార్టీ ని విమర్శించే స్థాయి కల్వకుంట్ల కవిత కు లేదని బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు.

ఈరోజు కేశంపేట్ మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,

బిజెపి పార్టీని విమర్శించే స్థాయి కల్వకుంట్ల కవితకు లేదని అన్నారు.నిన్న షాద్ నగర్ నియోజకవర్గం పర్యటకు వచ్చిన కల్వకుంట్ల కవిత బిజెపి పార్టీ ని విమర్శించడం తగదని అన్నారు.త్రిబుల్ ఆర్ కు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంటే జీర్ణించుకోలేక పోతున్నారు అని అన్నారు.తెరాస ఆయాంలో మీ కుటుంబం చేసిన అరాచకాలు అందరికి తెలుసని అన్నారు.ప్రజా అవసరాల దృష్ట్యా జాతీయ రహదారులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే విమర్శించడం కవితకు తగదని అన్నారు.రాష్ట్రంలో పది సంవత్సరాలు అధికారంలో ఉండి కూడ ఒక్క రోడ్డు కూడ వేయలేని పరిస్థితి మీ కుటుంబ పాలన అని అన్నారు.మీ కుటుంబ పాలనపై రాష్ట్ర ప్రజలు విసిగి చెంది గద్దె దించిన సంగతి



మర్చిపోయావా అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాజీ వైస్ ఎంపీపీ పసుల నరసింహా యాదవ్,మాజీ మండల అధ్యక్షులు పల్లె అంజయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్, మండల ఉపాధ్యక్షులు కంచుకోట నర్సింలు, జిల్లా నాయకులు కరెడ్ల నరేందర్ రెడ్డి,జిల్లా యువమోర్చ కార్యదర్శి కాణం ఉదయ్ కుమార్ గౌడ్, యువమోర్చ అధికార ప్రతినిధి ముల్తుంకర్ శివాజీ,మండల నాయకులు కుమార స్వామి గుప్తా కనుగుల మహేష్,తలసాని పవన్ కుమార్,వెంకటేశ్వర జి,బూత్ అధ్యక్షులు శ్రీశైలం,సందీప్, మరియు మహేష్ భారతీయ జనతా పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు రద్దు



అమరావతి**నవంబర్21,ప్రజావినికిడి,**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇకపై బోధనపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని, వారికి ఎలాంటి బోధనేతర పనులు అప్పగించబోమని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, మాజీ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ నేతృత్వంలోని ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరంలో వచ్చే నెలలో నిర్వహించే 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం)' మినహా ఉపాధ్యాయులకు ఇతర పనులేవీ ఉండవని హామీ ఇచ్చారు. డీఈఓ, ఎంఈఓలు కూడా కేవలం అభ్యసన ఫలితాలపైనే దృష్టి కేంద్రీకరించాలని, వారికి సర్వీస్ రూల్స్ వంటి బాధ్యతలు అప్పగించబోమని తేల్చిచెప్పారు. కడపలో విజయవంతమైన 'మోడల్ స్మార్ట్ కిచెన్ల'ను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత 17 నెలల్లో ఉపాధ్యాయ సంఘాలు తన దృష్టికి తెచ్చిన 423 సమస్యల్లో ఇప్పటికే 200 పరిష్కరించామని, మరికొన్ని పరిశీలనలో ఉన్నాయని వివరించారు.

## వరద బాధితులకు కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ సాయం

**ప్రజావినికిడి(పార్క్ వాజేడు) నవంబర్ 21:**

మండలంలో మారుమూల ప్రాంతంలో ఉన్న కడేకల్ గ్రామంలో కాఫేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వరద బాధితులకు కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ అద్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేసారు గ్రామంలో 139 కుటుంబాలకు 10కేజీల బియ్యం. పంచాదార, నూనె, దుప్పట్లు పప్పు చింతపండు మసాలా పసుపు శనగలు కారం బరకం అందజేశారు మొత్తం మూడు వేల రూపాయల విలువ చేసే సామాగ్రి ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పేరూరు ఎస్సై కృష ప్రసాద్,డాన్ బోస్కో రీజనల్ కోఆర్డినేటర్ ప్రణయ్, కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ లూర్థు రాజు హాజరైయ్యారు ఈ సందర్భంగా పేరూరు ఎస్సై మాట్లాడుతు సంస్థ చేసే సేవలను పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్న



నిత్యవసర సర్కులు పంపిణి చేస్తున్న ఎస్సై..

కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ ఇంకా ఎన్నో సేవలు అందించాలి అని అన్నారు ప్రణయ్ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతంలో ప్రజలు వరద సమయంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు సంస్థ డైరెక్టర్ లూర్థు రాజు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని గ్రామం లోనీ ఆచారం సాంప్రదాయం మరిచి పోతున్నారు మన ఆచారాలను కాపాడుకోవాలని



తెలియజేసారు ఏజెన్సీ ఏరియాలో ఉపయోగపడే విధంగా పథకాలు అభివృద్ధి పనులను చేయడం జరుగుతుంది అని తెలిపారు బడి మానేసిన పిల్లలను పాఠశాలలో చేర్పించే విధంగా చెయ్యాలని గ్రామస్తులకు సూచించారు ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల కోఆర్డినేటర్ గొంది కామేష్ గొంది హనుమంత్. వెంకటాపురం వాజేడు మండల యానిమేటర్స్ ప్రశాంత్, నరేష్, భాస్కర్,ఇందిరా, సుజల,పద్మ భాస్కర్, రమాదేవి,స్వరూప , ప్రసాద్ కడేకల్ గ్రామస్థులు పాల్గొన్నారు

## వంతు లఘు చిత్రం చూసి
# ఎంతో భావోద్వేగానికి లోనయ్యా..
### గ్రేహౌండ్స్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ఏ వెంకటేశ్వర్లు..





**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
వంతు చిత్రం చూసాను.ఎంతో భావోద్వేగానికి లోనయ్యాను.కన్న పిల్లలు నమ్మి తల్లిదండ్రులు తమ ఆస్తుల్ని ధనాన్ని పిల్లలకు ఇచ్చిన తర్వాత ఆ పిల్లలు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యంగా చూస్తే వీధులపాలు చేస్తే ఆ తల్లిదండ్రుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో వంతు చిత్రం ద్వారా కళ్ళకు కట్టినట్టు చూపించిన దర్శకనిర్మాత డాక్టర్ రావుల మోహన రెడ్డి ఎంతైనా అభినందనీయుడని అన్నారు. తెరపై కనిపించే ఏకైక పాత్రలో తండ్రిగా విలక్షణ దర్శకుడు సహజ నటుడు డాక్టర్ పి సి ఆదిత్య నటన అద్భుతమని చూస్తున్నంత సేపు కన్నీరు పెట్టించిందని సినీ రంగానికి ఆదిత్య లాంటి నటుడు చాలా అరుదుగా లభిస్తారని, సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ గ్రేహౌండ్ వెంకటేశ్వర్లు తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

## బీసీలకు 42% రిజర్వేషన్లు సాధించే విషయంలో
# కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఉంది

### :మధుయాష్కి గౌడ్..

**ప్రజావినికిడి,(కాచిగూడ):** తెలంగాణలో మద్దతిచ్చిన బిజెపి కేంద్రంలో ఎందుకు అడ్డుకుంటుంది.?
బిజెపి ద్వంద వైఖరిపై నిలదీయాలి.. ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు..బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించే విషయంలో సీఎం రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని,అది సాధించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన సహకారం ఇవ్వాలని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్,మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు.
బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్లు..సర్పంచ్ ఎన్నికలు..భవిష్యత్తు కార్యచరణ పై విస్తృతస్థాయి సమావేశాన్ని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడ లోని అభినందన్ గ్రాండ్ హెూటల్ లో నిర్వహించారు.వివిధ కుల సంఘాల ప్రతినిధులు, మేధావులు ఈ సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ, సామాజిక న్యాయం ఎజెండాగానే రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తున్నారని, ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోనూ సీఎం



రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కూడా సామాజిక న్యాయం దిశగా పనిచేస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు కోసం అసెంబ్లీలో బిజెపి పార్టీ ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చినప్పటికీ, పార్లమెంటులో బిల్లు పెట్టించకుండా బిజెపి ఎంపీలు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు.బిజెపి ద్వంద వైఖరిని బీసీ సమాజం తీవ్రంగా ఖండించాలన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ఇక పోరాటాలకు సిద్ధం కావాలని,కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రిగా సంజయ్ కుమార్ ఇంటిని ముట్టడించాలన్నారు. బి సి రిజర్వేషన్ అంశం ప్రజా పోరాటంగా మారాల్సిన అవసరం ఉందని,అప్పుడే పార్టీలు దిగివస్తాయన్నారు.
బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీని,సీఎం రేవంత్ రెడ్డిని అనుమానించాల్సిన అవసరం లేదని.. రిజర్వేషన్లు సాధించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నా కేంద్రం సహకరించడం లేదని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి,బీసీ సంఘాల జేఏసీ కి తాను వారధిగా పనిచేస్తూ రిజర్వేషన్లు సాధించేందుకు కృషి చేస్తానన్నారు.ప్రస్తుత పరిస్థితిలలో మావోయిస్టులు ఆయుధాలు చేతబట్టి ఏమి సాధించలేరని.. వారు కోరుతున్న సామాజిక న్యాయం కోసం ప్రజాక్షేత్రంలోకి వచ్చి ప్రజల మమేకంతో పోరాటం చేయాలని సూచించారు.ఎస్సీ ఎస్టీ బీసీ లకు సామాజిక న్యాయం కోసం, సంపదలో వాటా కోసం పని చేద్దామన్నారు.
సందర్భంగా బీసీ జేఏసీ చైర్మన్గా ఎన్నికైన జాజుల శ్రీనివాస్ గౌడ్ ని మధుయాష్కి బిసి సంఘాలతో నేతలతో కలిసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు గుజ్జ కృష్ణ, కుందారం గణేష్ చారి,కులకచర్ల శ్రీనివాస్ కనకాల శ్యామ్,తెలంగాణ విఠల్,సాంబశివ గౌడ్,విక్రమ్ గౌడ్,పానుగంటి విజయ్ గౌడ్,బూడిద మల్లికార్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రేపే రాక్ టౌన్ సొసైటీ ఎన్నికలు..
## బరిలో రెండు ప్యానెళ్లు -పోటా పోటీగా ఎన్నికల ప్రచారం..



రాక్ టౌన్ కాలనీలో వాకర్స్ ను కలిసి ప్రచారం చేస్తున్న అభ్యర్థులు



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):నవంబర్ 21,**
ఎల్బీనగర్ నియోజకవర్గంలోని రాక్ టౌన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీకి ఈనెల 23న ఎన్నికలు జరగనున్నాయి. ప్రతిష్టాత్మకమైన ఈ సొసైటీ ఎన్నికల్లో పోటీ పడుతున్న రెండు ప్యానెళ్ళు హెూరా హెూరీగా ప్రచారం చేస్తున్నాయి.ఒకటి కొండల్ రెడ్డి ప్యానల్ కాగా మరొకటి వినోద్ రెడ్డి ప్యానెల్ బరిలో ఉన్నాయి.మొదటి ప్యానెల్ లో అధ్యక్షుడిగా కొంతం కొండల్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అర్ధం వెంకట్ రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా సీనియర్ జర్నలిస్టు మామిడి సోమయ్య,సంయుక్త కార్యదర్శిగా మిర్యాల నరేష్ కుమార్, కోశాధికారిగా సూదిని రామచంద్రారెడ్డి పోటీ చేస్తుండగా రెండో ప్యానెల్ లో అధ్యక్షుడిగా ఎర్రవినోద్ రెడ్డి,ఉపాధ్యక్షుడిగా టి.మణిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్.జైపాల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎన్.సూర్యనారాయణ, కోశాధికారిగా జి.నాగరాజు పోటీలో ఉన్నారు.గత రెండు వారాలుగా అభ్యర్థులు కాలనీలో ఇంటింటికి తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ తమ మేనిఫెస్టోతో కూడిన కరపత్రాలతో ఓటర్లను ఒకటికి రెండుసార్లు కలుస్తూ...కాలనీలో అనేక ప్రధాన సమస్యలు పరిష్కారం కాలేదని,గత కమిటీ వారు సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని, మొత్తం సమస్యల పరిష్కారం,కాలనీ అభివృద్ధి కోసం మాకో అవకాశం ఇవ్వాలని కొండల్ రెడ్డి ప్యానల్ అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తుండగా,తాము గత ఎన్నికల్లో గెలిచిన కొన్ని పనులు చేశామని,మరోసారి అవకాశాం కల్పిస్తే ప్రధాన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు.ఏది ఏమైనా ఈ సొసైటీ ఎన్నికలు రసవత్తరంగా జరగబోతున్నాయి. ఒక ఇంటికి ఒక్క ఓటు ప్రకారం దాదాపు 800 ఓట్లు కలిగి ఉన్న ఈ సొసైటీకి జరుగుతున్న ఎన్నికల్లో తాము విజయం సాధించేందుకు రెండు ప్యానళ్ళు పోటీ పడుతున్నాయి. బరిలో ఉన్న అభ్యర్థులతో పాటు వారి అనుచరులు మూకుమ్మడిగా ప్రతీరోజు ఉదయం,సాయంత్రం వీదివీదినా తిరుగుతూ, ఇంటింటికీ,అపార్ట్మెంట్ లోని ఫ్లాట్ ఫ్లాట్ కూ వెళ్ళి తమ ప్యానెల్ అభ్యర్థులందరికీ ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.అదే విధంగా పొద్దున్నే వాకర్స్ ను,సీనియర్ సిటిజన్స్,యోగా సాధకులను,జిమ్ పార్కులో స్థానికులను కలుస్తున్నారు. ప్రచారంలో ఒక అడుగు ముందున్న కొండల్ రెడ్డి ప్యానల్ అభ్యర్థులు గెలుపు దిశగా,ఈ సారి మార్పు కావాలని,కొత్త ప్యానెల్ ను గెలిపించాలని కోరుతున్నారు.ఈ సొసైటీ ఎన్నికల ప్రచార సరళి చూస్తుంటే సాధారణ ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తోంది. రేపు ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సొసైటీ కార్యాలయం(కమ్యూనిటీ సెంటర్)లో జరుగుతున్న ఈ ఎన్నికల పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## విద్యుత్ వైర్ తెగి పాడిగేదె మృతి



**భీమదేవరపలినవంబర్21,ప్రజావినికిడి,**హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మండలం ముల్కనూర్ గ్రామంలో విద్యుత్ వైర్ తెగి పడడంతో పాడిగేదె మృతి చెందింది. ఇదే గ్రామానికి రైతు గిరబోయిన వెంకట్రాజం తన వ్యవసాయ పొలం వద్ద రోజులాగే పాడిగేదెను మేత కోసం వదిలిపెట్టాడు. అక్కడే తెగిపడి ఉన్న విద్యుత్ వైర్ తగలడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. మేలురకం పాడి గేదె కరెంటు తీగలకు బలికావడంతో పాడిరైతు, అతని కుటుంబ సభ్యులు బోరున విలపించారు. సుమారు రూ.1,20,000 విలువైన పాడిగేదె మృతి చెందడంతో తాము రోజువారీ ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు.

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో ఇర్సులాపురం
## ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఎంపిక.



**బయ్యారం/నవంబర్21,ప్రజావినికిడి,**ఏటూరునాగారం మండల కేంద్రంలోని కొమురం భీమ్ మినీ స్టేడియంలో రెండు రోజుల పాటు ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు,వసతి గృహాల విద్యార్థులకు నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడాపోటీలు గురు వారం ముగిసినట్లు ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల ఫీజికల్ డైరెక్టర్ బానోత్ వాలు తెలిపారు.ఈ సందర్భంగా వాలు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల నుండి క్రీడలలో 19,20,రెండు రోజులు జరిగిన ఐటిడిఎ క్రిడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన వాలు తెలిపారు.ఎంపికైన విద్యార్థులు అండర్ 17 వాలీబాల్ నందు పార్దు కార్తిక్ 10 వతరగతి, అండర్ 17 విభాగంలో ఎంపిక చేశారు.క్యారమ్స్ నందు టి.జస్వంత్ 10వ తరగతి,ఎం.చరణ్,9వ తరగతి అండర్ 17 విభాగంలో చెస్ నందు జి. చరణ్ 10 వ తరగతి ఎంపికయ్యారన్నారు.జోనల్ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ బి.శోభన్ బాబు,పీడీ బి.వాలు నాయక్, ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది అభినందించారు.

## మెక్సికో సుందరికి
# మిస్ యూనివర్స్ కిరీటం

### విజేతగా నిలిచిన ఫాతిమా బోష్

**నవంబర్21,ప్రజావినికిడి,**
మిస్ యూనివర్స్ 2025 పోటీల్లో మెక్సికోకు చెందిన ఫాతిమా బోష్ విశ్వసుందరి కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. థాయ్‌లాండ్‌లో అట్టహాసంగా జరిగిన 74వ మిస్ యూనివర్స్ ఫైనల్స్‌లో ఆమె విజేతగా నిలిచారు. గతేడాది విశ్వసుందరి, డెన్మార్క్‌కు చెందిన విక్టోరియా క్జార్ థెల్విగ్.. ఫాతిమాకు కిరీటాన్ని అలంకరించారు. పోటీల ఆరంభం నుంచే ఫేవరెట్‌గా ఉన్న ఫాతిమా తన అందం, ప్రతిభతో న్యాయనిర్ణేతలను మెప్పించారు.25 ఏళ్ల ఫాతిమా బోష్‌కు స్వదేశంలో, అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉంది. ఈ ఏడాది సెప్టెంబరులో ఆమె మిస్ యూనివర్స్ మెక్సికో 2025గా ఎంపికై, విశ్వవేదికపై తన దేశానికి ప్రాతినిధ్యం వహించారు. అయితే, ఈ పోటీలకు ముందు జరిగిన ఒక సంఘటన ఆమెను వార్తల్లో నిలిపింది.
రిహార్సల్స్ సమయంలో థాయ్‌లాండ్‌కు చెందిన ఓ పేజెంట్ డైరెక్టర్ తనపై కేకలు వేశారనే ఆరోపణలతో ఫాతిమా ఈవెనింగ్ గౌన్, హీల్స్‌తోనే వేదిక నుంచి వాకౌట్ చేశారు. ఈ ఘటన ఆన్‌లైన్‌లో పెద్ద చర్చకు దారితీసింది. అయినప్పటికీ ఆమె వెంటనే సంయమనం పాటించి తిరిగి రిహార్సల్స్‌లో పాల్గొన్నారు. తన వృత్తి నిబద్ధతను చాటుకుని, చివరికి విశ్వసుందరి కిరీటాన్ని గెలుచుకుని అందరి మన్ననలు పొందారు.



# ఇండియా కూటమిలో తీవ్ర సంక్షోభం..

### కాంగ్రెస్‌పై మిత్రపక్షాల ఫైర్

**నవంబర్21,ప్రజావినికిడి,**
బీహార్ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం 'ఇండియా' కూటమిలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఓటమి తర్వాత కాంగ్రెస్ నాయకత్వం, కూటమి అనుసరించిన వ్యూహాలపై భాగస్వామ్య పక్షాలు బాహాటంగానే ప్రశ్నలు సంధిస్తున్నాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలు కూటమి నుంచి వైదొలిగే అంశాన్ని కూడా పరిశీలిస్తుండటంతో కూటమి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.బీహార్ ఎన్నికలకు ముందే సీట్ల పంపకాల్లో తమను పక్కన పెట్టారని ఝూర?ండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఆరోపిస్తూ కూటమి నుంచి బయటకు వచ్చింది. తమను కేవలం జూనియర్ భాగస్వాములుగా చూస్తున్నారని, సమాన గౌరవం ఇవ్వడం లేదని జేఎంఎం నేతలు విమర్శిస్తున్నారు.
మరోవైపు, బీహార్ ఫలితాలు కూటమికి ఒక మేల్కొలుపు కావాలని శివసేన (యూబీటీ) వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ పార్టీ కొన్ని రాష్ట్రాల్లో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం వల్లే నష్టం జరిగిందని, మిత్రపక్షాలతో సరైన సమన్వయం లోపించిందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. కూటమిలో తీవ్రమైన దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ స్పష్టం చేశారు.
ఇక, బీహార్‌లో ఒంటరిగా పోటీ చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నిర్ణయమే సరైందని తాజా పరిణామాలతో స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పార్టీ సంస్థాగత విధానాలను ప్రక్షాళన చేయాలని, పారదర్శకమైన నిర్ణయాలు తీసుకోవాలని మిత్రపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.రాజకీయ విశ్లేషకుల ప్రకారం, ఇది ఇండియా కూటమికి ఒక నిర్ణయాత్మక ఘట్టం. నాయకత్వ సంక్షోభంలో ఉన్న కూటమిలో కొనసాగాలా? లేక సొంత మార్గం చూసుకోవాలా? అనే దానిపై ప్రాంతీయ పార్టీలు ఆలోచిస్తున్నాయి. మొత్తం మీద, బిహార్ ఓటమి ఇండియా కూటమిలో ఒక పెద్ద గుర్తింపు సంక్షోభాన్ని సృష్టించింది.

## హీరా గ్రూప్ ఎండీకీ షాక్..
## • రూ.19 కోట్ల విలువైన స్థిరాస్తి వేలం

హైదరాబాద **నవంబర్21,ప్రజావినికిడి,**
హీరా గ్రూప్ ఎండీ నౌహీరా షేక్?కు సంబంధించిన రూ.19.64 కోట్ల విలువైన స్థిరాస్తిని ఈడీ వేలం వేసింది. హీరా గోల్డ్ ఆస్తుల వేలం ప్రక్రియను కూడా ప్రారంభించినట్లు ఈడీ ప్రకటించింది. అటాచ్ చేసిన ఆస్తులను విక్రయానికి పెడుతున్నట్లు తెలిపింది. అధిక వడ్డీ ఆశ చూపి దేశవ్యాప్తంగా రూ. 5,900 కోట్లతో హీరా గ్రూప్ బోర్డు తిప్పేసింది. దేశవ్యాప్తంగా 52కు పైగా కేసులు నమోదయ్యాయి.36 శాతం వడ్డీ ఆశ జూపి హీరా గ్రూప్ గతంలో పెట్టుబడిదారుల నుంచి వేల కోట్ల రూపాయలను సమీకరించింది. కానీ అసలు, వడ్డీ ఇవ్వకుండా బాధితులను మోసం చేసింది. ఈ క్రమంలో హీరా గ్రూప్‌నకు చెందిన రూ.428 కోట్ల విలువ చేసే ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ఇప్పటి వరకు రూ. 93.63 కోట్ల విలువైన ఆస్తులను వేలం వేసింది. ఈ వేలం ద్వారా సమీకరించిన మొత్తాన్ని బాధితులకు అందజేయనుంది.



# నక్సల్స్ ఏరివేతే కాదు... గిరిజనుల అభివృద్ధి ముఖ్యం !

**నవంబర్21,ప్రజావినికిడి,**
కార్పొరేట్ల కన్ను అటవీ ప్రాంతాలపైన, కొండల కింద ఉన్న గనుల పైన పడటంతో గిరిజనులను అక్కడి నుండి వెళ్లగొట్టడానికి వివిధ పేర్లతో కుట్రలు జరుగుతున్నాయన్నది లెఫ్ట్ పార్టీల వాదనగా ఉంది. ఇది ఎంత వరకు నిజయమో తెలియాలి. ఇదే నిజమైతే దీనికి ప్రజాస్వామ్య పద్ధతిలో లెఫ్ట్ నేతలు కూడా పోరాటం చేపట్టాలి. ప్రజలను సమీకరించాలి. అడవులను నాశనం చేసేవారు ఎంతటి వారైనా నిలదీయాల్సిందే. అటవీ హక్కులను తిరస్కరిస్తున్నట్లుగా గుర్తిస్తే అందుకు ప్రజా ఉద్యమాలను నిర్వహించాలి. గిరిజనులతో నామమాత్రంగా కూడా చర్చించకుండానే పలు ప్రాజెక్టులను వారి నివాస ప్రాంతాల్లో చేపడుతున్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారు. చట్ట ప్రకారం తప్పనిసరైన గ్రామసభలనుసైతం దాటవేస్తున్నారు. ఈ తరహా సర్కారీ దమనకాండపై అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఉక్కుపాదం మోపుతున్నారని అంటున్నారు. లెఫ్ట్ పార్టీలకు ఉద్యమాలు, పోరాటాలు కొత్త కాదు. ఇవే నిజమైతే ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిందే. కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే తీవ్ర నిర్బంధ చర్యల ద్వారా మావోయిస్టులపై పై చేయి సాధించవచ్చు. కానీ, అణచివేతకు గురవుతున్న ప్రజానీకపు జీవన పరిస్థితుల్లో మార్పు రాకుంటే వారిలోని అసంతృప్తి మరోరూపం తీసుకోవచ్చు. ఇది ఒక సామాజిక ఆర్థిక సమస్య. క్షేత్రస్థాయిలో అసమానతలు రూపుమాపడమే దీనికి పరిష్కారం కావాలి. అలాగే గిరిజనులను పాలనలో భాగస్వాములను చేయాలి. వారి నివాస ప్రాంతాల్లో అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో నిర్ణయాధికారం వారిదే కావాలి. విద్య, వైద్య సౌకర్యాలతో పాటు, ఉపాధిని పెద్ద ఎత్తున కల్పించాలి. దీంతో అడవుల్లో అన్నల అవసరం రాకపోవచ్చు. మావోయిస్టుల పేరుతోనో, వారి సానుభూతిపరుల పేరుతోనో గిరిజనులపై పోలీసుల వేధింపులను, నిర్బంధాన్ని తక్షణం నిలిపివేయాలి. ఇకపోత నక్సల్స్ ఏరివేత వెనక ఇదే పరమార్థం అని అంటున్నారు. నక్సల్స్ ఏరివేతతో అటవీ సంపద వినాశనాన్ని ముడిపెట్టరాదు. ఇవి రెండు కూడా వేర్వేరు అంశాలు. అందువల్ల మావోయిస్టులు ఏరివేతను అడవుల సంరక్షణతో పోల్చరాదు. అడవులను కార్పోరేట్లకు కట్టిపెడుతున్నారని ఖచ్చితమైన సమచారం ఉంటే ఎవ్వరైనా పోరాడవచ్చు. ఇకపోతే లొంగిపోవడానికి వచ్చిన నక్సల్స్ నేత హిడ్మాను, ఆన భార్య, ఇతర అనుచరులను మట్టుపెట్టారని, క్రెడిట్ దక్కించు కోవడానికే పోలీసులు ఈ పనిచేశారని వస్తున్న వార్తలపై పోలీసులే నిజాలు వెల్లడిస్తారని అనుకుంటే పోరపాటే. ఎందుకంటే ఖాకీ దుస్తులు వేసుకున్న తరవాత వారికి మానవత్వం అన్నది ఉండదు. నక్సలైట్ ఉద్యమంలో ఎందరో పోలీసులు అసువులు బాసారు. ఎందరో క్రూరంగా హత్యకు గురయ్యారు. మందుపాతరలకు బలయ్యారు. ఇవన్నీ వారు తప్పకుండా పరిగణలోకి తీసుకుంటారు. దీనికితోడు ప్రభుత్వం వారికి టార్గెట్లు విధించింది. అందువల్ల చిక్కిన అవకాశాన్ని వదులుకోరు. అందులోనూ నక్సల్స్ విషయంలో అస్సలు ఉండదు. మనం ఇక్కడ రెండు వైపులా ఆలోచన చేయాలి. నక్సల్స్ కూడా తమ ఉద్యమంలో కిరాతకంగా వ్యవహరించారు. చంపడంలో ఆరితేరారు. ఖతం చేయడమే వారి ఉద్యమంగా సాగింది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. మొత్తంగా నక్సల్స్ ఉద్యమంలో రెండువైపులా ప్రాణనష్టం జరిగింది. అమాయకులను ఎందరినో వారు పొట్టన పెట్టుకున్నారు. నేతలను బలితీసుకున్నారు. దీంతో



వారు సాధించిందేమీ లేకపోగా, ఉద్యమం వల్ల దేశానికి తీవ్ర నష్టమే జరిగింది. అందుకే హిడ్మా లొంగిపోవడానికి వచ్చినా పట్టుకుని కాల్చేశారని అంటున్నారు. పోలీసులు అవకాశం కోసం చూస్తారు. అదను చూసి దెబ్బ తీస్తారు. ఇదంతా ఎలా ఉన్నా ఇరువైపులా హింస సరికాదు. నక్సల్స్ కూడా ప్రజల పక్షాన పోరాడడం మాని కేవలం అడవుల్లోనే ఉంటూ హింసాత్మక ఘటనలతో భీతావాహ పరిస్థితులను సృష్టించారు. నిజంగానే ఇప్పటికైనా నక్సల్స్ ఉంటే వారంతా జనజీవన స్రవంతిలోకి రావాలి. ప్రజల పక్షాన సమస్యలపై పోరాడాలి. ఇకపోతే అసలు ఆపరేషన్ కగార్ చేపట్టిందే హిడ్మా కోసమని, ఆయన కోసం డెడ్‌లైన్ కూడా పెట్టారని, ఆ గడువులోపలే పనిపూర్తయిందని మీడియాలో వస్తున్న కథనాలను చూస్తూనే ఉన్నాం. కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా కూడా పదేపదే మార్చి అంటూ టార్గెట్ పెడుతూనే ఉన్నారు. అందుకే తాజా రెండు ఎన్‌కౌంటర్లతో ఏం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. భయోత్పాతం సృష్టించడమే లక్ష్యంగా జరిగే పోలీసు కనుసన్నల్లో జరిగే ఈ తరహా సంఘటనలు ఎంతమాత్రం సమర్థనీయం కాదని కొందరు అంటున్నారు. నక్స్లకు మద్దతుగా నిలిచిన వారికి ఇది మారణహోమంగానే ఉంటుంది. అదే సందర్భంలో రాజకీయ నేతలను, పోలీసులను నక్సల్స్ అత్యంత కిరాతకంగా హత్య చేసిన పలు సందర్భాల్లో ఇప్పుడు విమర్శలు చేస్తున్నవారు ఏనాడూ స్పందించలేదు. నక్సల్స్‌కు భయపడి వీరంతా మిన్నకున్నారు. నిజానికి ఇటువంటి అప్రజాస్వామిక, హింసాత్మక విధానాలను ఎవరు అవలంబించినా ఖండించాల్సిందే. ఇకపోతే మరో నక్సల్ నాయకుడు తిప్పిరి తిరుపతి పోలీసుల అదుపులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే పోలీసులు అదుపులోకి తీసుకున్న వారందరినీ తక్షణం న్యాయస్థానాల ముందు హాజరుపర్చాలి. ఇకపోతే రెండు రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా జరుగుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు, అరెస్టులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఒక కుదుపు కుదిపాయి. ఎందుకంటే ఇటీవలి కాలంలో ఎపిలో నక్సల్స్‌ఉన్న జాడలేదు. అందుకే ఈ ఎన్‌కౌంటర్లపై సహజంగానే అనుమానాలు రవాడం సహజం. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగిన పోలీసు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజక్కతో సహా ఆరుగురు మరణించారు. ఈ సంఘటన రేపిన కలకలం చల్లారకముందే, 24 గంటలలోపే బుధవారం ఉదయం దాదాపు అదే ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో ఏడుగురు మావో యిస్టులు ప్రాణాలు నేలకొరిగారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వమే మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయుధాలతో సహా బేషరతుగా లొంగిపోవడం తప్ప మరో మార్గంలేదని సాక్షాత్తు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పదేపదే ప్రకటించారు. ఆ హెచ్చరికల నేపథ్యంలోనే ఇవన్నీ సాగుతున్నాయని భావించాల్సిందే. ఆపరేషన్ కగార్ చేపట్టినతరువాత అంతా అయిపోయిందనుకుంటే పొరపాటు. అక్కడ నివసిస్తున్న గిరిజనుల సమస్యలు పరిష్కరించకుండా ముందుకు సాగితే పరిస్థితుల్లో మార్పు రాదని ప్రభుత్వాలు గుర్తించాలి.

## రాయపూర్‌లో మూడ్రోజుల పాటు డిజిపిల సమావేశం

### హాజరవుతున్న ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు


రాయపూర్,**నవంబర్21,ప్రజావినికిడి,**ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈ నెల 28 నుంచి 30 వరకు అన్ని రాష్ట్రాల డీజీపీల సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, సీనియర్ అధికారులు పాల్గొంటారు. ఈ వార్షిక సమావేశంలో ప్రధానంగా ఆపరేషన్ కగార్ పురోగతి, ఉగ్రవాద దాడుల నిరోధక వ్యూహాలు ప్రధాన అజెండాగా ఉండనున్నాయని తెలిసింది. మావోయిస్టుల లొంగుబాట్లు, వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని, కేంద్ర హోంమంత్రి హాజరవుతుండటంతో సమావేశానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ప్రత్యేక కమాండోలు, సీఆర్‌పీఎఫ్, ఎన్ఐఏ, ఐబీ బృందాలు రాయ్‌పూర్ చేరుకుని వ్యూహాత్మక భద్రతా ప్రణాళికను అమలు చేస్తున్నాయి. ఈ సమావేశానికి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి తదితరులు హాజరుకానున్నారు. శాటిలైట్ నిఘా, డ్రోన్ పెట్రోలింగ్, గ్రౌండ్ ఆపరేషన్స్ ను మరింత సమర్థవంతంగా మార్చడంపై కీలక నిర్ణయాలు తీసుకుంటారని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఇటీవలి వరుస ఎన్‌కౌంటర్లు, హిడ్మా తదితరుల హతం తరవాత దీనికి ప్రత్యేకత ఏర్పడింది.

-----------

## నిఖత్ జరీన్ పోలీస్ శాఖకు గర్వకారణం

### గోల్డ్ మెడల్ సాధించినందుకు డిజిపి అభినందనలు

హైదరాబాద **నవంబర్21,ప్రజావినికిడి,**



ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల తెలంగాణ డీజీపీ బీ. శివధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ స్పెషల్ పోలీస్ డీఎస్పీ నిఖత్ జరీన్‌ను అభినందించారు. మహిళల 51 కేజీల ఫైనల్స్‌లో తన ప్రత్యర్థిపై 5-0 తేడాతో ఘన విజయం సాధించడం ఆమె సామర్థ్యానికి, అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. 'గోల్డ్ మెడల్ సాధించి తెలంగాణ పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచిన నిఖత్ జరీన్‌ను అభినందిస్తున్నాను. క్రీడల్లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన నిఖత్ విజయం ఇతర క్రీడాకారులకు ఆదర్శం' అని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ కుటుంబం తరఫున నిఖత్ జరీన్ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీజీపీ ఆకాంక్షించారు. ఇదిలావుంటే సీఐడీ విభాగంలో నేర విశ్లేషణ, సాంకేతికత కోసం క్రైమ్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఎనాలసిస్ పేరుతో ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎంపిక చేసిన జిల్లాల్లో 'సేఫ్ విలేజ్' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్రంలోని పోలీస్ కమిషనర్లు,
ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తీవ్రమైన నేరాలు, ఆర్థిక నేరాలు, బాలలకు సంబంధించిన నేరాలపై లోతుగా చర్చించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల పరిధిలో 'సేఫ్ విలేజ్ ప్రోగ్రాం'ను విస్తృతంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

## అల్ ఫలా యూనివర్శిటీ కార్యకలాపాలపై నిఘా

### ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఏర్పాటు చేస్తూ ఆదేశం




న్యూఢిల్లీ, **నవంబర్21,ప్రజావినికిడి,**అల్ ఫలా యూనివర్శిటీ కార్యకలాపాలపై నిఘా కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను ఏర్పాటు చేసినట్లు ఫరీదాబాద్ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్స్ ఆఫ్ పోలీస్, ఇన్‌స్పెక్టర్ మరియు ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన సిట్‌యూనివర్శిటీ కార్యకలాపాలపై సమగ్ర నివేదికను రూపొందిస్తోందని అన్నారు. ఫరీదాబాద్‌లోని అల్ ఫలా యూనివర్శిటీ వ్యవహారాలను దర్యాప్తు చేయడానికి సిట్‌ను ఏర్పాటు చేశామని, అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని ఫరీదాబాద్ పోలీస్ ప్రతినిధి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి యూనివర్శిటీకి చెందిన పలువురు వైద్యులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.ర్యాప్తు సంస్థలు క్యాబ్ డ్రైవర్, మతాధికారి, ఉర్దూ ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. క్యాబ్ డ్రైవర్ ధౌజ్ గ్రామానికి చెందినవారు కాగా, మిగిలిన ఇద్దరు నుహ్ జిల్లాకు చెందిన వారని పేర్కొన్నాయి. సోహ్నా సమీపంలోని రాయ్‌పూర్ గ్రామంలోని షాహిజామా మసీదు నుండి వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

## గవర్నర్లకు గడువు ఉండాల్సిందే

### అవసరమైతే రాజ్యాంగ సవరణ చేయాలి -సుప్రీం తీర్పుపై తమిళనాడు సిఎం స్టాలిన్ వ్యాఖ్య

చెన్నై,**నవంబర్21,ప్రజావినికిడి,**శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి,గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని సుప్రీం కోర్టు స్పష్టం చేయడంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. బిల్లులపై నిర్ణయం తీసుకునేలా గవర్నర్లకు గడువు విధించే విధంగా రాజ్యాంగంలో సవరణలు తెచ్చేవరకు తమ పోరాటం ఆపబోమని వెల్లడించారు.
ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన అభిప్రాయం.. ఏప్రిల్ 8 నాటి తీర్పును (తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్) ప్రభావితం చేయలేదు. వాస్తవానికి ఎన్నికైన ప్రభుత్వం డ్రైవర్ సీటులో ఉండాలని, రాష్ట్రంలో రెండు పాలక వర్గాలు ఉండకూడదని సుప్రీం తీర్పు పునరుద్ఘాటించింది. బిల్లులను పక్కన పడేసేలా వీటో అధికారం చూపే అవకాశం గవర్నర్లకు ఉండదు. బిల్లులను నిలిపివేసే అధికారం వారికి లేదు. రాష్ట్ర



హక్కులు, సమాఖ్యవాదం కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్టాలిన్ స్పష్టం చేశారు. తమిళనాడు గవర్నర్ బిల్లులను నిరవధికంగా నిలిపివేయడాన్ని సవాల్‌చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం ఏప్రిల్ 8న నిర్ణయం వెలువరించింది. ఆ తీర్పు రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో జోక్యం చేసుకున్నట్లుగా ఉండటంతో మే 13న ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము 14 ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం కీలక తీర్పు వెలువరించింది. బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని
రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. అయితే తమ వద్దకు వచ్చిన బిల్లులను గవర్నర్లు అకారణంగా, నిరవధికంగా నిలిపివేయడం తగదని, సహేతుక సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అందుకు రాజ్యాంగ సవరణ అవసరమని ఇప్పుడు సిఎం స్టాలిన్ అభిప్రాయపడ్డారు.

## నాగార్జున సాగర్ కుడికాలువకు గండి

### అధికారులను అప్రమత్తం చేసన మంత్రులు -యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చివేత చర్యలు

అమరావతి,**నవంబర్21,ప్రజావినికిడి,**
నాగార్జున సాగర్ కుడికాలువ గండిపై ఇరిగేషన్ అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు అప్రమత్తం చేశారు. సమీప గ్రామాల్లోకి నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు చెప్పారు. గండి పడటానికి గల కారణాలను నివేదిక రూపంలో అందించాలని ఇరిగేషన్ అధికారులను మంత్రి నిమ్మల ఆదేశించారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చుతున్నారు. ఆందోళన వద్దని గ్రామస్తులకు సూచిస్తున్నారు. మధ్యాహ్నం కల్లా గండి పూడ్చి వేత పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే పల్నాడు జిల్లాలో నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గండి పడిన ఘటనపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. అధికారులు
అప్రమత్తమై నష్టాన్ని గణనీయంగా తగ్గించారని పేర్కొన్నారు. గండిని పూడ్చేయటంతో ఇప్పుడు



ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఇకపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లాలో నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గురువారం అర్ధరాత్రి గండిపడింది. ఎస్కేప్ ఛానల్ వద్ద కట్టకు గండి పడటంతో నాగులేటి వాగుకు ప్రవాహం పెరిగింది. దీంతో వాగు పరీవాహక ప్రాంత ప్రజలు భయాందోళన చెందారు. ఈక్రమంలో అధికారులు అప్రమత్తమై శుక్రవారం ఉదయం గండిని పూడ్చారు. నాగార్జున సాగర్ కుడికాలువ కట్టకు గండి పడింది. కారంపూడి ఎస్కేప్ ఛానల్ వద్ద అర్ధరాత్రి వేళ కట్టకు గండి పడింది. కాలువకు గండి పడటంతో నాగులేటి వాగుకు ప్రవాహం అంతకంతకూ పెరుగుతూ పోతోంది. వీరుల తిరునాళ్లలో ఏర్పాటు చేసిన దుకాణాల్లోకి నీరు చేరింది. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సమీప ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలీక బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు హుటాహుటిన గండిపడ్డ చోటుకు చేరుకున్నారు. గండిని పూడ్చే పనులు చేపట్టారు. ప్రాజెక్టు వద్దే నీటిని నిలుపుదల చేయాల్సి ఉందని స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు కట్టను ధ్వంసం చేసి ఉండొచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

------------

## మావోలు అద్దెకున్న ఇళ్ల పరిశీలన

### కేబుల్ పనికోసం వచ్చినట్లుగా గుర్తింపు

### ఆరా తీసిన స్థానిక పోలీసులు

ఏలూరు,**నవంబర్21,ప్రజావినికిడి,**తిఏలూరులో మావోయిస్టుల అరెస్టు నేపథ్యంలో వారు నివసించిన ఇంటి పరిసర ప్రాంతంలోని స్థానికులను పోలీసులు విచారించారు. ఈ సందర్భంగా పలు కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. వీరంతా కేబుల్ పని చేస్తామంటూ ఇల్లు అద్దెకు దిగారు. నెలకు రూ. 10 వేలు చొప్పున అద్దె చెల్లిస్తామంటూ ఆ ఇంట్లోకి మావోయిస్టులు దిగారు. ఆ ఇంట్లో భారీగా మనుషులు ఉన్నా.. వారిలో ఇద్దరు మాత్రమే బయటకు వచ్చి.. ఆహారం తీసుకువచ్చే వారని స్థానికులు వెల్లడించారు. మిగిలిన వారంతా ఇంట్లోనే ఉండేవారని చెప్పారు. అక్టోబర్ 26వ తేదీన మావోయిస్టులు ఇల్లు అద్దెకు తీసుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంటి యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మావోయిస్టులు ఇల్లు వెతుక్కుంటూ స్వయంగా వారే వచ్చారా? లేకుంటే ఎవరైనా మధ్యవర్తిత్వం వహించారా? అలా అయితే ఆ మధ్యవర్తిత్వం వహించిన వాళ్లు ఎవరనే కోణంలో పోలీసులు.. ఆ ఇంటి యజమానిని ప్రశ్నిస్తున్నారు. వంబర్ 18వ తేదీ తెల్లవారుజామున అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంప చోడవరం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, ఆయన భార్య రాజేతోపాటు పలువురు మావోయిస్టులు మరణించారు. అదే రోజు రాష్ట్రంలో వివిధ జిల్లాల్లోని ప్రధాన నగరాలు విజయవాడ, కాకినాడ, ఏలూరుల్లో మొత్తం 50 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచారు. వారికి కోర్టు రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో పోలీసులు వారి నుంచి కీలక సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

# గౌహతి మైదానం నాకు చాలా ఇష్టం

## నా వన్డే అరంగేట్రం ఇక్కడే జరిగింది

## భారత కెప్టెన్ రిషభ్ పంత్ వ్యాఖ్య




భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో రెండవ మ్యాచ్ రేపటి నుంచి గౌహతిలో ప్రారంభం కానుంది. మొదటి టెస్ట్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగింది. ఆ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 30 పరుగుల తేడాతో గెలిచింది. ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో గౌహతి పిచ్ కూడా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై భారత కెప్టెన్ రిషభ్ పంత్ ఒక పెద్ద స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈసారి పిచ్ మెరుగ్గా ఉంటుందని తాను ఆశిస్తున్నానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రెండవ టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రిషభ్ పంత్ మాట్లాడారు. "ఈ మైదానం (గౌహతి) నాకు చాలా ఇష్టం అని ముందుగా చెప్పాలనుకుంటున్నాను. నా వన్డే అరంగేట్రం ఇక్కడే జరిగింది. అంతేకాదు టెస్ట్ టీమ్‌కు కెప్టెన్‌గా నా అరంగేట్రం కూడా ఈ మైదానంలోనే మొదలవుతోంది. అందుకే ఈ స్థలం నాకు, అలాగే గౌహతి మొత్తానికి చాలా ప్రత్యేకం. ఎందుకంటే ఇక్కడ తొలిసారి టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది" అని పంత్ భావోద్వేగంగా చెప్పారు. పిచ్ గురించి మాట్లాడుతూ.. పంత్ సానుకూలత వ్యక్తం చేశారు. "పిచ్ విషయానికి వస్తే ఈసారి పిచ్ మెరుగ్గా ఉంటుందని నేను అనుకుంటున్నాను. ముఖ్యంగా బ్యాటింగ్‌కు ఇది బాగా అనుకూలించే అవకాశం ఉంది. కొన్ని రోజుల తర్వాత పిచ్ టర్న్ అయ్యే అవకాశం ఉంది. కానీ నా ఉద్దేశంలో ఇది ఒక మంచి టెస్ట్ మ్యాచ్‌గా ఉంటుంది" అని పంత్ నమ్మకంగా చెప్పారు. అంటే మొదటి రోజు నుంచే పిచ్ స్పిన్నర్లకు పట్టు ఇవ్వకుండా.. బ్యాట్స్‌మెన్‌లకు కూడా అవకాశం ఇస్తుందని పంత్ టీమ్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించినందుకు పంత్ ఈ సందర్భంగా బీసీసీఐకి మరోసారి ధన్యవాదాలు తెలిపారు. "కొన్నిసార్లు మనం పెద్ద మ్యాచ్ గురించి ఎక్కువగా ఆలోచిస్తే దాని వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. అందుకే నేను ఎక్కువగా ఆలోచించదలుచుకోలేదు. మొదటి టెస్ట్ మాకు బాగా ఆడలేదు. అందుకే రెండవ టెస్ట్‌లో గెలవడానికి అవసరమైనదంతా చేస్తాం" అని పంత్ పేర్కొన్నారు. కోల్‌కతా ఓటమిని మర్చిపోయి.. ఈ టెస్ట్‌లో ఎలాగైనా గెలిచి సిరీస్‌ను సమం చేయాలని టీమిండియా పట్టుదలగా ఉంది.

# కెప్టెన్‌గా రిషబ్ పంత్

## రెండో టెస్ట్ నుంచి శుభమన్ గిల్ అవుట్




శుభ్‌మన్ గిల్ అధికారికంగా భారత్ VS దక్షిణాఫ్రికా రెండో టెస్ట్ నుంచి వైదొలిగాడు. కోల్‌కతాలో జరిగిన మొదటి టెస్ట్ రెండో రోజున మెడ నొప్పి కారణంగా మైదానాన్ని వీడాడు. అతని నొప్పి చాలా ఎక్కువగా ఉండటంతో ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. అతను రెండో ఇన్నింగ్స్‌లో కూడా బ్యాటింగ్ చేయలేకపోయాడు. గువాహటిలో జట్టుతో చేరిన గిల్ ఆడటంపై ముందే సందేహం ఉంది, కానీ ఇప్పుడు ఒక ప్రకటన విడుదల చేసి దీన్ని ధృవీకరించింది. అతని స్థానంలో రిషబ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. తన ప్రకటనలో,"దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టెస్ట్‌లో మెడ నొప్పికి గురైన టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, గువాహటిలో జరిగే రెండో టెస్ట్ నుంచి వైదొలిగాడు. గిల్ కోల్‌కతా టెస్ట్ రెండో రోజున మెడ నొప్పికి గురయ్యాడు. ఆట ముగిసిన తర్వాత పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతన్ని పరిశీలనలో ఉంచారు. మరుసటి రోజు డిశ్చార్జ్ చేశారు. అతను నవంబర్ 19, 2025న గువాహటికి వెళ్ళాడు. దురదృష్టవశాత్తు, అతను రెండో టెస్ట్‌లో ఆడటానికి పూర్తిగా ఫిట్‌గా లేడు. తన గాయం గురించి మరింత పరీక్షల కోసం ముంబైకి వెళ్తాడు. గిల్ లేకపోవడంతో రిషబ్ పంత్ రెండో టెస్ట్‌లో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు." టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదికల ప్రకారం.. శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం ముంబైలో రెండు నుంచి మూడు రోజులు విశ్రాంతి తీసుకుని, ఆ తర్వాత ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ దినషా పర్దివాలా నుంచి మెడ నొప్పికి సంబంధించి ప్రత్యేక సలహా తీసుకోనున్నాడు. కోల్‌కతాలో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లోనే గిల్‌కు గాయమైంది. మ్యాచ్ రెండవ రోజున బ్యాటింగ్‌కు వచ్చిన వెంటనే, కొన్ని బంతులు ఎదుర్కొన్న తర్వాత మెడలో తీవ్రమైన అసౌకర్యాన్ని అనుభవించాడు. ఫిజియో వచ్చి పరీక్షించిన తర్వాత, అతను రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాల్సి వచ్చింది. గాయం తీవ్రత దృష్ట్యా, అతన్ని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆ మ్యాచ్‌లో అతను మళ్లీ ఆడలేదు. జట్టుతో కలిసి గువహాటి వచ్చినా, చివరకు రెండో టెస్ట్‌కు దూరమయ్యాడు. శుభ్‌మన్ గిల్ దూరమవడంతో అతని స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ జట్టు కెప్టెన్సీని చేపట్టనున్నారు. అయితే ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంపిక చేయడంలో గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు మేనేజ్‌మెంట్‌కు కొన్ని ముఖ్యమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో సాయి సుదర్శన్ లేదా నితీష్ కుమార్ రెడ్డిలలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. అదనపు స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను బెంచ్‌కే పరిమితం చేసే అవకాశం ఉంది. మ్యాచ్‌కు ముందు జరిగిన నెట్ ప్రాక్టీస్‌లో కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ మాత్రమే పాల్గొన్నారు. గిల్ తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకుని టెస్ట్‌లో ఆడాలనుకున్నప్పటికీ, జట్టు యాజమాన్యం అతని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎటువంటి రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా లేదు. దక్షిణాఫ్రికాతో భారత జట్టు నవంబర్ 29 నుంచి వన్డే సిరీస్ కూడా ఆడాల్సి ఉంది. అయితే గిల్ ప్రస్తుతం మెడ నొప్పితో బాధపడుతున్నందున, ఆ వన్డే సిరీస్‌లో అతను పాల్గొంటాడా లేదా అనే విషయంపై ఇంకా అధికారికంగా ఎటువంటి స్పష్టత లేదు.

# ఆఖరికి వైడ్ బాల్‌తో గెలిచి ఫైనల్‌కు వెళ్లిన బంగ్లాదేశ్




రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ 2025లో తొలి సెమీ-ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠకు పరాకాష్టగా నిలిచింది. ఈ మ్యాచ్‌ను ఒక సాధారణ క్రికెట్ మ్యాచ్ అని కాకుండా ట్విస్టులు, ఉత్కంఠ, చివరికి ఊహించని ఫలితం ఇచ్చిన డ్రామా సినిమా అని చెప్పవచ్చు. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 194 పరుగులు చేయగా, దానికి సమాధానంగా టీమిండియా A కూడా సరిగ్గా 194 పరుగులే చేసి మ్యాచ్‌ను టై చేసింది. అయితే, సూపర్ ఓవర్ లో మాత్రం భారత్‌కు దారుణ అనుభవం ఎదురైంది. ఆఖరికి ఒకే ఒక్క వైడ్ బాల్ కారణంగా బంగ్లాదేశ్ అద్భుత విజయం సాధించి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. ఈ ఓటమితో టోర్నమెంట్‌లో భారత్ ప్రయాణం ముగిసింది. 195 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన భారత్ A జట్టుకు ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్ ఆర్య మంచి ఆరంభాన్ని ఇచ్చారు. వైభవ్ సూర్యవంశీ (15 బంతుల్లో 38 రన్స్), ప్రియాన్ష్ ఆర్య (23 బంతుల్లో 44 రన్స్) మెరుపు ఇన్నింగ్స్‌లతో దూసుకుపోయారు. ఆ తర్వాత కెప్టెన్ జితేష్ శర్మ కూడా 23 బంతుల్లో 33 పరుగులు చేసి పోరాడాడు. చివరి 6 బంతుల్లో భారత్‌కు గెలవడానికి 16 పరుగులు అవసరం కాగా, అశుతోష్ మూడవ బంతికి సిక్సర్, నాలుగో బంతికి ఫోర్ కొట్టి ఉత్కంఠను పెంచాడు. ఆఖరి బంతికి హర్ష్ దూబే 3 పరుగులు తీయడంలో విజయం సాధించడంతో స్కోరు 194 పరుగుల వద్ద నిలిచి మ్యాచ్ టై అయింది. మ్యాచ్ టై అవ్వడంతో విజేతను నిర్ణయించడానికి సూపర్ ఓవర్ అనివార్యమైంది. అయితే ఈ చిన్న పోరాటంలో భారత జట్టు దారుణంగా విఫలమైంది. సూపర్ ఓవర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ A జట్టు తరఫున కెప్టెన్ జితేష్ శర్మ, ఆశుతోష్ శర్మ కనీసం ఒక్క పరుగు కూడా చేయకుండానే తొలి రెండు బంతులకే ఔట్ అయ్యారు. దీంతో భారత ఇన్నింగ్స్ సున్నా పరుగులకే ముగిసింది. కేవలం ఒకే ఒక్క పరుగు లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ కూడా సూపర్ ఓవర్ లో తొలి బంతికే యాసిర్ అలీ వికెట్ కోల్పోయింది. అయితే, అదృష్టం బంగ్లాదేశ్ వైపు ఉండటంతో భారత బౌలర్ వేసిన రెండో బంతి వైడ్ అంపైర్ ప్రకటించారు. దీంతో వైడ్ ద్వారా వచ్చిన ఆ ఒక్క పరుగుతో బంగ్లాదేశ్ A జట్టు ఉత్కంఠభరితమైన ఈ సెమీ-ఫైనల్‌లో విజయం సాధించి నేరుగా ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. గుర్జప్నీత్ సింగ్ 2 వికెట్లు తీసినా వైభవ్ సూర్యవంశీ (38), ప్రియాన్ష్ ఆర్య (44), జితేష్ (33) బాగా ఆడినా చివరికి సూపర్ ఓవర్‌లో వైడ్ బాల్ రూపంలో వచ్చిన అదృష్టం బంగ్లాదేశ్‌ను గెలిపించింది.

# వైభవ్ సూర్యవంశీ చితక్కొట్టాడు



ఖతార్ రాజధాని దోహాలో జరుగుతున్న ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2025 సెమీ ఫైనల్ మ్యాచ్‌లో మరోసారి భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ చితక్కొట్టాడు. శుక్రవారం (నవంబర్ 21) ఇండియా-ఏ, బంగ్లాదేశ్-ఏ జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో వైభవ్ అద్భుతమైన బ్యాటింగ్‌తో బంగ్లాదేశ్ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడు. వైభవ్ ఇన్నింగ్స్ మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ సెమీఫైనల్ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ మరోసారి మెరుపు వేగంతో బ్యాటింగ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో అతను అర్ధ సెంచరీ చేయలేకపోయినా తన దూకుడుతో భారత ఇన్నింగ్స్‌కు బలమైన ఆరంభం ఇచ్చాడు. వైభవ్ సూర్యవంశీ కేవలం 15 బంతుల్లో 38 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో వైభవ్ సూర్యవంశీ 4 సిక్సర్లు, 2 ఫోర్లు బాదాడు.

వైభవ్ 253.33 అనే అత్యంత ప్రమాదకరమైన స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయడం విశేషం. బంగ్లాదేశ్ బౌలర్ అబ్దుల్ గఫార్ సక్లైన్ నాలుగో ఓవర్ నాలుగో బంతికి వైభవ్‌ను ఔట్ చేయడంతో అతని విధ్వంసం ముగిసింది. ఈ సెమీఫైనల్ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ మరోసారి మెరుపు వేగంతో బ్యాటింగ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో అతను అర్ధ సెంచరీ చేయలేకపోయినా తన దూకుడుతో భారత ఇన్నింగ్స్‌కు బలమైన ఆరంభం ఇచ్చాడు. వైభవ్ సూర్యవంశీ కేవలం 15 బంతుల్లో 38 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో వైభవ్ సూర్యవంశీ 4 సిక్సర్లు, 2 ఫోర్లు బాదాడు. వైభవ్ 253.33 అనే అత్యంత ప్రమాదకరమైన స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయడం విశేషం. బంగ్లాదేశ్ బౌలర్ అబ్దుల్ గఫార్ సక్లైన్ నాలుగో ఓవర్ నాలుగో బంతికి వైభవ్‌ను ఔట్ చేయడంతో అతని విధ్వంసం ముగిసింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 194 పరుగుల భారీ స్కోరు సాధించింది. హబీబుర్ రెహమాన్ (46 బంతుల్లో 65 పరుగులు) అత్యధిక స్కోరు చేయగా.. ఎంఎం మెహ్రాబ్ (18 బంతుల్లో 48 పరుగులు), జిషాన్ ఆలం (14 బంతుల్లో 26 పరుగులు) దూకుడుగా ఆడారు. భారత బౌలర్లు ఈ మ్యాచ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. నమన్ ధీర్ 2 ఓవర్లలో 33 పరుగులు ఇచ్చి వికెట్ తీయలేక అత్యంత ఖరీదైన బౌలర్‌గా నిలిచాడు. విజయ్‌కుమార్ విశాక్ 4 ఓవర్లలో 51 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు.

# తొలిరోజే అభిమానులకు థ్రిల్





**పూర్తిగా ఆధిపత్యం కనిపించిన బౌలర్లు**

**172 పరుగులకే ఇంగ్లాండ్ ఆలౌట్**

**ఇంగ్లాండ్ నడ్డివిరిచిన మిచెల్ స్టార్క్**

**7 వికెట్లతో ఆదరహో అనిపించుకున్న స్టార్క్**

**ఇంగ్లాండ్ బౌలర్లు దీటుగా సమాధానం**

**ఆసీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 123-9**

**బెన్ స్టోక్స్ ధాటికి కుదేలైన ఆసీస్ బ్యాటర్లు**


**స్టోక్స్ కేవలం 6 ఓవర్లలోనే 5 వికెట్లు**

**రసవత్తరంగా సాగుతున్న యాషెస్ సిరీస్**

యాషెస్ సిరీస్ 2025లో పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ మొదటి రోజు అసాధారణ రీతిలో చరిత్ర సృష్టించింది. ఈ రోజు మొత్తం బౌలర్ల ఆధిపత్యమే నడిచింది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ 7 వికెట్లతో విజృంభించగా.. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కేవలం 6 ఓవర్లలోనే 5 వికెట్లు పడగొట్టడంతో టెస్ట్ క్రికెట్‌లో అరుదైన రికార్డు నమోదైంది. మొదటి రోజు ఆటలో ఏకంగా 19 వికెట్లు నేలకూలాయి. యాషెస్ సిరీస్ చరిత్రలో గత 100 ఏళ్లలో టెస్టు మ్యాచ్ తొలి రోజున 19 వికెట్లు పడటం ఇదే మొదటిసారి. అంతకుముందు 1909లో ఓల్డ్ ట్రాఫర్డ్ మైదానంలో తొలి రోజు 18 వికెట్లు నేలకూలాయి. పెర్త్‌లో ఒక టెస్ట్ మొదటి రోజు అత్యధిక వికెట్లు పడటం కూడా ఇదే తొలిసారి. గతంలో 2024లో భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌లో 17 వికెట్లు పడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ జట్టు మిచెల్ స్టార్క్ (7 వికెట్లు) విధ్వంసకర బౌలింగ్ వల్ల 172 పరుగులకే ఆలౌట్ అయింది. హ్యారీ బ్రూక్ (52), ఓలీ పోప్ (46) మాత్రమే కొంత పోరాటాన్ని చూపగా.. మిగతా బ్యాటర్లు స్టార్క్ ధాటికి తలవంచారు. ఇంగ్లండ్‌ను స్వల్ప స్కోరుకే పరిమితం చేసిన తర్వాత, బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా కేవలం 123 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి బ్యాక్‌ఫుట్‌లో పడింది. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తన బౌలింగ్‌తో మెరిశాడు. బెన్ స్టోక్స్ కేవలం 6 ఓవర్ల స్పెల్‌లో 23 పరుగులు మాత్రమే ఇచ్చి ఏకంగా 5 కీలక వికెట్లు పడగొట్టాడు. ఆసీస్ బ్యాటర్లు స్టీవ్ స్మిత్ (17), ట్రావిస్ హెడ్ (21), కామెరూన్ గ్రీన్ (24)తో పాటు మరో ఇద్దరు కీలక బ్యాటర్లను స్టోక్స్ పెవిలియన్ చేర్చాడు. జోఫ్రా ఆర్చర్ కూడా జోస్యం చేసి జేక్ వెదెరాల్డ్‌ను (0) తొలి బంతికే ఔట్ చేయగా, లబుషేన్ (9), ఖవాజా (2) తక్కువ స్కోరుకే ఔటయ్యారు. రోజు ఆట ముగిసే సమయానికి నాథన్ లయన్ (3), బ్రెండన్ డాగెట్ (0) క్రీజులో ఉన్నారు. కెప్టెన్ స్టోక్స్ స్పెల్ కారణంగా ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో కూడా ఆధిక్యాన్ని సాధించడంలో విఫలమైంది. ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ అద్భుతంగా ప్రదర్శన చేయడంతో ఇంగ్లండ్ జట్టు తమ మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 172 పరుగులకే ఆలౌటైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. దూకుడుగా ఆడే 'బేజ్‌బాల్' వ్యూహాన్ని అమలు చేయాలని భావించిన ఇంగ్లండ్‌కు ఆస్ట్రేలియా పేస్ ఎటాక్ ఆదిలోనే కళ్లెం వేసింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో అత్యధికంగా పరుగులు చేసింది ఇద్దరే కావడం గమనార్హం. హ్యారీ బ్రూక్ (52 పరుగులు) తనదైన శైలిలో దూకుడుగా ఆడి అర్ధ సెంచరీ పూర్తి చేసి జట్టుకు కొంత ఉపశమనం అందించాడు. ఓలీ పోప్ (46 పరుగులు) కూడా బ్రూక్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు గట్టి పోరాటం చేశాడు. వీరితో పాటు జెమీ స్మిత్ (33), ఓపెనర్ బెన్ డకెట్ (21) ఫర్వాలేదనిపించినా.. మిగతా బ్యాటర్లంతా ఆసీస్ పేస్ దాడి ముందు చేతులెత్తేశారు. కెప్టెన్ బెన్ స్టోక్స్ సహా కీలక బ్యాటర్లు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరడంతో ఇంగ్లండ్ భారీ స్కోరు సాధించలేకపోయింది. ఇంగ్లండ్ పతనంలో ప్రధాన పాత్ర పోషించింది ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్. తన పదునైన స్వింగ్, వేగంతో ఇంగ్లండ్ బ్యాటింగ్ ఆర్డర్‌ను స్టార్క్ కూల్చేశాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 7 వికెట్లు పడగొట్టగా.. బ్రెండన్ డొగ్గెట్ 2 వికెట్లు, క్యామెరాన్ గ్రీన్ ఒక వికెట్ తీశాడు. స్టార్క్ ఏకంగా 7 వికెట్లు తీయడం ఆస్ట్రేలియాకు బలమైన ఆరంభాన్ని ఇచ్చింది. దీంతో ఇంగ్లండ్ జట్టు 172 పరుగులకే తమ ఇన్నింగ్స్‌ను ముగించింది. ఇంగ్లండ్ స్వల్ప స్కోరుకే ఆలౌట్ కావడంతో, ఆస్ట్రేలియా బ్యాటింగ్ ప్రారంభించి, తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సంపాదించేందుకు సిద్ధమవుతోంది. యాషెస్ ఆరంభంలోనే పైచేయి సాధించిన ఆసీస్, ఇంగ్లండ్‌పై ఒత్తిడిని మరింత పెంచింది.

# వచ్చేసింది బాలయ్య ‘అఖండ 2’ ట్రైలర్...


# అంచనాలు పెంచేసింది!




నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న హైఓల్టేజ్ చిత్రం ‘అఖండ 2: తాండవం’ నుంచి ట్రైలర్ విడుదలైంది. ‘అఖండ’కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై ఉన్న భారీ అంచనాలను రెట్టింపు చేసేలా ట్రైలర్‌ను తీర్చిదిద్దారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.

‘సింహా’, ‘లెజెండ్’, ‘అఖండ’ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ల తర్వాత బాలకృష్ణ, బోయపాటి కలయికలో వస్తున్న నాలుగో చిత్రం కావడంతో అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో బాలకృష్ణ మరోసారి తన పవర్‌ఫుల్ లుక్‌తో, డైలాగ్స్‌తో ఆకట్టుకున్నారు. **His RAGE is DIVINE His POWER is DESTRUCTIVE%μμ** అంటూ విడుదల చేసిన ట్రైలర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, తమన్ అందించిన నేపథ్య సంగీతం సినిమాపై అంచనాలను మరింత పెంచాయి.ఈ చిత్రంలో ఆది పినిశెట్టి, సంయుక్త మీనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట, బాలకృష్ణ చిన్నకుమార్తె ఎం. తేజస్విని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ‘అఖండ 2 సర్జికల్ స్ట్రైక్’, ‘అఖండ 2 తాండవం’ అనే ట్యాగ్‌లైన్స్‌తో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన ‘అఖండ’కు కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 23న ‘రాజాసాబ్’ ఫస్ట్ సింగిల్..




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘ది రాజా సాబ్’ సినిమా నుంచి కీలక అప్డేట్ వచ్చేసింది. దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నుంచి మొదటి పాటను విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఈ ఫస్ట్ సింగిల్‌ను నవంబర్ 23న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారుఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. “విజిల్స్ వేయించే ట్రీట్ తీసుకువస్తున్నాం... ‘రెబెల్ సాబ్’ గీతం ఈ నెల 23న వస్తోంది” అంటూ చేసిన ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటంతో, ప్రభాస్ సినిమాకు ఆయన ఇచ్చే మ్యూజిక్ ఎలా ఉంటుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్, బోమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి స్పందన లభించింది. ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. మొదటి పాట విడుదలతో సినిమా ప్రమోషన్లు అధికారికంగా ప్రారంభం కానున్నాయి.

# అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలకు జీహెచ్ఎంసీ నోటీసులు




హైదరాబాద్‌లోని ప్రముఖ సినీ నిర్మాణ సంస్థలైన అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారులు కొరడా ఝుళిపించారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లింపులో భారీగా పన్ను ఎగవేతకు పాల్పడినట్టు గుర్తించి, రెండు స్టూడియోలకు నోటీసులు జారీ చేశారు. ఏళ్లుగా వ్యాపార విస్తీర్ణాన్ని ఉద్దేశపూర్వకంగా తక్కువగా చూపిస్తూ, బల్దియాకు చెల్లించాల్సిన ఫీజులో కోత విధిస్తున్నట్టు అధికారులు తేల్చారు.బల్దియా సర్కిల్-18 అధికారులు ఇటీవల జరిపిన తనిఖీల్లో ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అధికారిక లెక్కల ప్రకారం, అన్నపూర్ణ స్టూడియో ఏటా రూ. 11.52 లక్షల ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ. 49 వేలు మాత్రమే చెల్లిస్తున్నట్లు తేలింది. అదేవిధంగా, రామానాయుడు స్టూడియోస్ చెల్లించాల్సిన రూ. 1.92 లక్షలకు బదులుగా కేవలం రూ. 1,900 మాత్రమే చెల్లిస్తున్నట్టు అధికారులు నిర్ధారించారు.ఈ రెండు స్టూడియోలు తమ వ్యాపార విస్తీర్ణాన్ని వాస్తవం కంటే చాలా తక్కువగా చూపడం వల్లే ఫీజులో ఇంత భారీ వ్యత్యాసం కనిపిస్తోందని అధికారులు వివరించారు. ఈ పన్ను ఎగవేతను తీవ్రంగా పరిగణించిన జీహెచ్ఎంసీ... బకాయిపడ్డ పూర్తి మొత్తాన్ని వెంటనే చెల్లించాలని ఆదేశిస్తూ నోటీసులు పంపింది. వాస్తవ విస్తీర్ణం ఆధారంగా ట్రేడ్ లైసెన్స్‌ను పునరుద్ధరించుకోవాలని కూడా స్పష్టం చేసింది.

# వేశ్య పాత్రను ఒప్పుకోవడానికి కారణం ఇదే: బిందు



మొదట వద్దనుకున్నా, కథ విన్నాక నిర్ణయం మార్చుకున్నానని వెల్లడి

‘అవకాయ బిర్యానీ’ చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై, ఆ తర్వాత బిగ్‌బాస్ విన్నర్‌గా నిలిచి మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి బిందు మాధవి, తన తదుపరి చిత్రంలో ఓ సవాలుతో కూడిన పాత్రలో కనిపించనున్నారు. ఆమె నటిస్తున్న ‘దండోరా’ సినిమాలో వేశ్య పాత్రను పోషిస్తున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఈ పాత్రను అంగీకరించడానికి గల కారణాలను వెల్లడించారు.

మురళీకాంత్ దర్శకత్వంలో, లైక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవీంద్ర బెనర్జీ ముప్పనేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో, పాత ఆచారాలు, హాస్యం, భావోద్వేగాల కలబోతగా ‘దండోరా’ తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవి కృష్ణ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ పాత్ర గురించి బిందు మాధవి మాట్లాడుతూ.. “దర్శకుడు కథ చెప్పడానికి వచ్చినప్పుడు, సినిమా అప్పటికే సగం పూర్తయిందని చెప్పారు. దాంతో నా పాత్ర చిన్నదేమో అని మొదట వద్దనుకున్నాను. కానీ కథ విన్న తర్వాత నా ఆలోచన పూర్తిగా మారిపోయింది. నా పాత్ర ఎంట్రీతోనే సినిమా మొత్తం మలుపు తిరుగుతుందని అర్థమైంది. కథలో అంతటి ప్రాధాన్యం ఉన్న పాత్ర కావడంతో వెంటనే అంగీకరించాను. ఆ క్షణంలోనే ఈ పాత్ర నాదే అని ఫిక్స్ అయ్యాను” అని వివరించారు. సాధారణంగా ఇలాంటి పాత్రలు చేయడానికి చాలా ధైర్యం కావాలని, అయితే కథలో ఉన్న బలం వల్లే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని బిందు మాధవి స్పష్టం చేశారు.

# ఏలియన్ వలలో చిక్కిన తమన్నా..





తనదైన గ్లామ్, డ్యాన్స్ మూవ్స్ తో కుర్రకారు గుండెల్లో గుబులు పుట్టించే అందాల భామ తమన్నా ఇప్పుడు ఏలియన్ చేతికి చిక్కింది. ఇప్పుడు ఏలియన్ వల నుంచి విడిపించడం ఎలా?.. ఇదిగో ఇక్కడ తమన్నా ఫ్యాషన్ సెన్స్ చూశాక, యూత్ ఫీలింగ్ ఇది. ప్రయోగాలు చేయనిదే కొత్తదనం సాధ్యపడదు. ఫ్యాషన్ ప్రపంచంలో సృజనాత్మకతకు అంతూ దరీ లేదనడానికి ఇది ఒక చక్కని ఉదాహరణ. తాజాగా తమన్నా ఎంపిక చేసుకున్న ఆల్ బ్లాక్ డిజైనర్ డ్రెస్ చూడగానే, ఎవరు ఈ ఏలియన్ సుందరి? అనే సందేహం కూడా కలుగుతుంది. ఇతర గ్రహం నుంచి ఈ భూమ్మీదికి వచ్చిందా? అంటూ మాట్లాడుకునేంత ట్రిక్కీగా కనిపిస్తోంది. పండోరా గ్రహం మీద దిగిన ఏలియన్ కన్యలాగా కూడా కనిపిస్తోంది! అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. మొత్తానికి తమన్నా ప్రయోగం సూపర్‌హిట్ అయింది. ప్రస్తుతం ఈ యూనిక్ లుక్ ఇంటర్నెట్ తుఫాన్ లా దూసుకెళుతోంది. తమన్నా కెరీర్ మ్యాటర్ కి వస్తే, అటు ఉత్తరాది సహా దక్షిణాది సినిమాలతో కెరీర్ రన్ కొనసాగిస్తోంది. ప్రస్తుతం నాలుగు సినిమాలతో మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా బిజీ బిజీగా ఉంది. అజయ్ దేవగన్ సరసన రేంజర్ అనే చిత్రంలో నటిస్తోంది. రోమియో, వివాన్ అనే చిత్రాలతోను బిజీగా ఉంది. రోహిత్ శెట్టి దర్శకత్వం వహిస్తున్న యాక్షన్ డ్రామాలోను తమన్నా నటిస్తోంది.

# రాజమౌళికి మద్దతుగా ఆర్జీవీ..



ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి వివాదాస్పద డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ మద్దతుగా నిలిచారు. దేవుడిని నమ్మే హక్కు ఎంత ఉందో, నమ్మకపోవడానికీ అంతే హక్కు ఉందని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ఇదే విషయాన్ని చెబుతోందని ఆయన స్పష్టం చేశారు. రాజమౌళిని విమర్శిస్తున్న వారిపై వర్మ తనదైన శైలిలో ఘాటు వ్యాఖ్యలు చేశారు.ఇటీవల తన కొత్త సినిమా ‘వారణాసి’ టైటిల్ లాంఛ్ కార్యక్రమంలో రాజమౌళి మాట్లాడుతూ, తనకు దేవుడిపై అంతగా నమ్మకం లేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో పలువురు ఆయనను విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆర్జీవీ తన ‘ఎక్స్’ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. “రాజమౌళిపై విషం కక్కుతున్న వారు ఒకటి తెలుసుకోవాలి. భారతదేశంలో నాస్తికుడిగా ఉండటం నేరం కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం నమ్మకపోవడానికీ హక్కు ఉంది” అని వర్మ తెలిపారు.“దేవుడిని నమ్మకపోతే ఆయనపై సినిమాలు ఎందుకు తీస్తున్నారన్న వాదన అర్థరహితం. ఆ లాజిక్ ప్రకారం గ్యాంగ్‌స్టర్ సినిమా తీయాలంటే దర్శకుడు గ్యాంగ్‌స్టర్‌గా మారాలా? దెయ్యం సినిమా తీయాలంటే దెయ్యం అవ్వాలా?” అని ప్రశ్నించారు. దేవుడిని నమ్మకపోయినా, దేవుడే రాజమౌళికి వందల రెట్ల విజయాన్ని, సంపదను ఇచ్చాడని వర్మ అన్నారు.

అసలు సమస్య రాజమౌళి నాస్తికత్వం కాదని, పూజలు చేసి కూడా విఫలమైన వారిలో ఉన్న అసూయేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విమర్శల వెనుక ఉన్నది దైవభక్తి ముసుగులో ఉన్న అసూయ మాత్రమేనని వర్మ తేల్చిచెప్పారు. ‘వారణాసి’ సినిమాతో రాజమౌళి బ్యాంకు బ్యాలెన్స్ మరింత పెరుగుతుందని, విమర్శకులు అసూయతో ఏడవవచ్చని తన పోస్ట్‌ను ముగిస్తూ చివర్లో ‘జై శ్రీరామ్’ అని పేర్కొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613